ప్రజాశక్తి

గురువారం 16 ఫిబ్రవరి 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

మన్నుపోతున్నా మౌనమే..!

- యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు, తరలింపు
- కరుగుతున్న కొండలు, గుట్టలు
- అధికారుల ఉదాసీనతతో రెచ్చిపోతున్న మట్టిమాఫియా

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

అనుమతులు లేవు.. అడిగే వారు లేరు.. ఇంకేముంది చెరువులు, గుట్టలు, కొండలను యథేచ్ఛగా తవ్వేస్తున్నారు.. అందినంత దోచుకుంటున్నారు. పల్నాడు జిల్లా కేంద్రంగా నరసరావుపేట ఏర్పడడంతో ఈ ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. అనుమతులతో సంబంధం లేకుండా పొలాలన్నీ లే అవుట్లు అవుతున్నాయి. ఆయా భూములను చదును చేసేందుకు రియల్టర్లకు మట్టి అవసరం కాగా దాన్ని మట్టి మాఫియా సమకూరుస్తోంది. నరసరావుపేట చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, గుట్టలు, కొండలను జెసిబిల ద్వారా అక్రమంగా తవ్వేసి టిప్పర్ల ద్వారా ఇష్టానుసారం తరలిస్తున్నారు. ప్రైవేట్ భవనాలు, షాపింగ్ కాంప్లెక్సులు, గోదాములు, రియలెస్టేట్ వెంచర్లకు టిప్పర్ సుమారు రూ.7-10 వేలకు అమ్ముతున్నారు.

ప్రస్తుతం నరసరావుపేట చుట్టూ మట్టి మాఫియా చుట్టుముట్టింది. నరసరావుపేటకు శివారు చుట్టూ ఉన్న పది కిలోమీటర్ల దూరంలో గల గ్రామాల నుండి పగలు, రాత్రి అని లేకుండా నిత్యం జెసిబిల ద్వారా మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. వీరికి మైనింగ్ అనుమతులేమీ లేకున్నా ఇదంతా అధికార పార్టీ నేతల కనుసన్నల్లో జరుగుతున్నదే

▶ 2లో

కరుగుతున్న ఉండవల్లి కొండ

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి ఎస్సీ కాలనీ సమీపంలోని కొండ కనుమరుగవుతోంది. ఇక్కడి నుంచి పెద్ద ఎత్తున మట్టి, గ్రావెల్‌ను అక్రమార్కులు తరలిస్తున్నారు. ప్రజాశక్తి ఆ ప్రాంతానికి వెళ్లి మట్టి అక్రమ తరలింపుపై స్థానికులను సమాచారం అడిగినా ఎవరూ నోరుమెదపడం లేదు. మట్టి, గ్రావెల్‌ను

▶ 2లో

ఇళ్ల తొలగింపు నోటీసులపై రాస్తారోకో

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక విద్యానగర్ నుండి సుద్దపల్లి డొంక పంప్ హైస్ వరకూ ఏర్పాటు చేసిన యుజిడి పైప్‌లైన్ కూలిపోయే స్థితిలో ఉన్నందున, పైప్‌లైన్‌పై ఉన్న ఇళ్ల తొలగింపునకు స్థానిక పాతగుంటూరులోని జున్నూషాహిద్ నగర్ వాసులకు జిఎంసి అధికారులు నోటీసులు ఇవ్వటాన్ని వ్యతిరేకిస్తూ కాలనీ వాసులు బుధవారం పొన్నూరు రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. కాలనీ మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో రాస్తారోకోలో పాల్గొని సుమారు రెండు గంటలపాటు నిరసన తెలిపారు. దీంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. స్థానిక ఎమ్మెల్యే ముస్తఫా రాస్తారోకో వద్దకు వచ్చి మద్దతు తెలిపారు. న్యాయం జరిగే విధంగా చూస్తానని చెప్పారు. అయితే లిఖితపూర్వక హామీ ఇవ్వాలని కాలనీవాసులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ఈ అంశాన్ని ఆధారం చేసుకొని కొందరు రాజకీయం చేయాలని చూస్తున్నారని అని వెళ్లిపోయారు. కార్పొరేటర్ మీరావలి అక్కడికి వచ్చి ప్రజలతో

▶ 2లో

కొండ వద్ద పార్కింగ్ కోసం యాప్

- 90 అడుగులు దాటిన ప్రభ వద్ద ఇద్దరు పోలీసులు
- కుల, రాజకీయ పాటలు నిషేధం : ఐజి

6లో

19న ఎస్ఐ పోస్టులకు రాత పరీక్ష

8లో

వివరాలు వెల్లడిస్తున్న సూపరింటెండెంట్, పక్కన రోగి, వైద్య బృందం

చేతితో పట్టి.. గుండెకు చప్పుడునిచ్చి..

- జిజిహెచ్‌లో అరుదైన ఆపరేషన్ విజయవంతం
- ఆగిన గుండెను పునరుద్ధరించిన వైద్యులు

2లో

5లో

అధ్యయనంతో ఏదైనా సాధ్యమే

విజ్ఞాన్ మహోత్సవంలో వాణీమోహన్

కల్తీ విత్తుపై చర్యలెందుకు లేవు?

- తెనాలిలో సౌకర్యాలున్నా జిజిహెచ్‌కి పేషెంట్లు
- డిఆర్‌సిలో గళమెత్తిన ప్రజాప్రతినిధులు
- ఇళ్ల నిర్మాణాలకు రూ.5లక్షలు ఇవ్వాలి : కెఎస్ లక్ష్మణరావు
- డిఆర్‌సి సమావేశంలో సమస్యలను ఏకరువుపెట్టిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

కల్తీ విత్తనాలు, పురుగు మందులు పెద్దఎత్తున వెలుగు చూస్తున్నా చర్యలు శూన్యమని, ప్రతిఏటా ఇదే పునరావృతం అవుతోందని, రైతులు నష్టపోతున్నా ఎందుకు చర్యలు ఎందుకు తీసుకోవట్లేదని ఎమ్మెల్సీలు ప్రశ్నించారు. జిల్లా సమీక్ష కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించారు. రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ధర్మాన ప్రసాదరావు అధ్యక్షతన పలు అంశాలపై వ్యవసాయం, ఇళ్ల స్థలాలు, రీసర్వే, విద్య, వైద్యం, సంక్షేమం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు.

వ్యవసాయంపై ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు చర్చను ప్రారంభిస్తూ ఫిరంగిపురం, మేడికొండూరు మండలాల్లో కల్తీ విత్తనాల వల్ల మిర్చి రైతులు నష్టపోయారన్నారు. యూరియా అధిక ధరలకు విక్రయించకుండా కల్తీ పురుగు ముందులు, విత్తనాల విక్రయించకుండా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి, శిక్షలు అమలు చేయాలన్నారు. ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ కల్తీ విత్తనాలు, పురుగు మందుల విక్రయాలు అరికట్టేందుకు, నంద్యాల ఇతర ప్రాంతాల నుంచి నాణ్యత తక్కువ విత్తనాలు విక్రయించే వ్యాపారులపై వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, దాడులు నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కల్తీ విత్తనాలు, పురుగు మందులను అరికట్టేందుకు ఉత్పత్తులు వలన పంటలకు నష్టం జరిగితే నష్టపరిహారం అందించేందుకు విక్రయదారులు, రైతులు, వ్యవసాయశాఖ మధ్య ట్రైపార్టీ అగ్రిమెంట్‌ను ఉత్పత్తుల కొనుగోలు

▶ 2లో

చేతితో పట్టి.. గుండెకు చప్పుడునిచ్చి..

జిజిహెచ్‌లో అరుదైన ఆపరేషన్ విజయవంతం

ఆగిన గుండెను పునరుద్దరించిన వైద్యులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఆగిపోయిన వృద్ధుని గుండెను మళ్లీ పునరుద్ధరించి అరుదైన ఆపరేషన్‌ను గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్) వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఇదే వైద్యం కార్పొరేట్ ఆస్పత్రుల్లో అయితే రోజుకు రూ.లక్ష ఖర్చయ్యేదని చెప్పారు. ఈ మేరకు వివరాలను జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.ప్రభావతి బుధవారం వెల్లడించారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం నందనవనాకి చెందిన 70 ఏళ్ళ ఇ.వెంకటేశ్వర్లు కొంతకాలం నుంచి కడుపు నొప్పి, కడుపు ఉబ్బరం, వాంతులతో బాధ పడుతున్నాడు. ఆయన్ను తొలుత ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా జిజిహెచ్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో గత నెల 18న జిజిహెచ్‌కు రాగా సర్జరీ వైద్యులు పరీక్షలు చేసి కడుపులో కేన్సర్ గడ్డ ఉండటం వల్ల వాంతులు వస్తున్నాయని నిర్ధారణకు వచ్చారు. రోగి పాత రికార్డులను పరిశీలించి 20 ఏళ్ల కిందట గుండె ఆపరేషన్ చేసి స్టెంట్‌లు అమర్చినట్లు గుర్తించి గుండె వైద్యులను సంప్రదించారు. ఈ విభాగం వైద్యులు పరీక్షలు చేసి గుండె చాలా బలహీనంగా ఉందని, ఆపరేషన్ రిస్క్ చేయాల్సి వస్తుందని చెప్పారు. సర్జరీ వైద్యులు మళ్లీ వివిధ పరీక్షలు చేసినా సమస్య నిర్ధారణ కాలేదు. మరోవైపు రోగికి మాత్రం వాంతులు తగ్గక ఆహారం తీసుకోలేక పోతున్నాడు. ఆపరేషన్ చేయాలని వైద్యులు నిర్ణయించారు. సర్జరీ విభాగాధిపతి డాక్టర్ వై.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈనెల 2వ తేదీన ఆపరేషన్‌ను ప్రారంభించారు. కడుపును ఓపెన్ చేసి చూడగా ఛాతికి కడుపునకు మధ్యభాగంలోని కండరాల్లో చిన్న రంధ్రం ఉన్నట్లు గుర్తించారు. అదే పరిస్థితిలో కడుపులోని ప్రేగులు గుండె, ఊపిరితిత్తులకు అతుక్కు ఉన్నట్లు కూడా గమనించారు. ఈ సమస్యను డయాఫ్రమెటీక్ హెర్నియగా గుర్తించారు. ఈ సమయంలో బాధితునికి హఠాత్తుగా గుండె కొట్టుకోవడం ఆగిపోయింది. ఛాతిపై నుంచి మసాజ్ చేస్తే గుండె కొట్టుకుంటుందని మత్తు వైద్యులు సూచించినా రోగి వయస్సు రీత్యా సాధ్యంకాదనుకున్నారు. అయితే డాక్టర్ కిరణ్‌కుమార్ సమయస్ఫూర్తితో కడుపులో ఉన్న చేతిని నేరుగా గుండెను నొక్కి మసాజ్ చేయడంతో కొద్ది క్షణాల్లో గుండె కొట్టుకోవడం ప్రారంభించింది. ఆ తర్వాత శస్త్ర చికిత్స కొనసాగించి పొట్టలోని పేగులను కడుపులోకి లాగి డయాఫ్రమెటీక్‌కి ఉన్న రంధ్రాన్ని మూసి వేసి దానిపై ప్రొలెనే మెష్ అమర్చి పటిష్టంగా ఉండేలా చేశారు. అనంతరం 48 గంటల పాటు ఐసియు లో వెంటిలేటర్‌పై ఉంచారు. గుండె, ఊపిరి తిత్తులు, మెదడు పని చేస్తున్నాయని నిర్ధారణకు వచ్చి వెంటిలేటర్‌ను తొలగించి ద్రవహారాన్ని ఇవ్వడంతో రోగి కోలుకున్నాడు. దీంతో ఆయన్ను బుధవారం డిశ్చార్జి చేశారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ చికిత్సను ఆరోగ్యశ్రీ పథకం కింద పూర్తిగా ఉచితంగా చేసామని. కార్పొరేట్ ఆసుపత్రుల్లో అయితే రోజుకు రూ.లక్ష ఖర్చయ్యేదని తెలిపారు. వైద్య బృందాన్ని సూపరింటెండెంట్ అభినందించారు. ఈ చికిత్సలో వైద్యులు రమణాచలం, సంతోష్, వెంకట రమణ, వంశీ, కిషోర్, నిఖిల్, లిఖిత, కోటి, వేణు, అనూష, మత్తు వైద్యులు మహేష్‌బాబు, ప్రదీప్, ధరణి,స్వేత పాల్గొన్నారు.

ఇళ్ల తొలగింపు నోటీసులపై రాస్తారోకో

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. ఇళ్లు కూల్చివేయటానికి తీసుకొచ్చిన బుల్డోజర్‌ను అక్కడి నుండి పంపించి వేయటంతో రాస్తారోకో ప్రజలు విరమించారు. పైప్‌లైన్ కూలిపోయే స్థితిలో ఉందని, వాటిపై నిర్మించిన ఇళ్లూ కూడా కూలిపోతాయని ఇంజినీరింగ్ అధికారులు నివేదిక ఇచ్చారని నోటీసుల్లో పేర్కొన్నారు. ఏడు రోజుల్లోగా ఇళ్లు తొలగించుకోవాలని, లేదంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అయితే తమకు ప్రత్యామ్నాయం చూపకుండా, ఇళ్లు తొలగిస్తే ఊరుకోమని, ప్రత్యామ్నాం చూపిన తర్వాతే తొలగించాలని డిమాండ్ చేశారు

కల్తీ విత్తుపై చర్యలెందుకు లేవు?

(మొదటి పేజీ తరువాయి)

సమయంలో అమలు చేసే అంశంపై వ్యవసాయశాఖ క్షుణ్ణంగా పరిశీలించి, నివేదికను తదుపరి జరిగే డీఆర్సీ సమావేశం నాటికి అందించాలన్నారు. వట్టిచెరుకూరు మండలంలో నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోయారని ఎమ్మెల్యే సుచరిత ప్రస్తావించారు.

వీటిపై మంత్రి ధర్మాన ప్రసాదరావు, కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి స్పందిస్తూ ట్రై పార్టీ అగ్రిమెంట్‌కు ఉన్న అవకాశాలను పరిశీలించి నివేదిక అందించాలని వ్యవసాయ శాఖను ఆదేశించారు. కౌలు రైతులకు వచ్చే ఏడాదికైనా రూ.100 కోట్లు రుణాలు అందించేందుకు యంత్రాంగం ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, డొక్కా మాణిక్య వరప్రసాద్ కోరారు. బ్యాంబో సాగు విస్తీర్ణం పెంచేందుకు నేషనల్ బ్యాంబో మిషన్ రైతులకు అందించే ప్రోత్సాహకాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి సూచించారు. గుంటూరు ఛానల్ విస్తరణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరగా, విస్తరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి చెప్పారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని మెరుగుపర్చాలి..

విద్యపై చర్చలో మధ్యాహ్న భోజన పథకాన్ని మెరుగుపర్చాలని పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కోరారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ అక్షయ పాత్ర నిర్వహిస్తున్న ప్రాంతాల్లో భోజనం రుచికరంగా ఉండట్లేదని, ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలన్నారు. ఎమ్మెల్యేలు సుచరిత, కిలారి వెంకటరోశయ్య, అన్నాబత్తుని శివకుమార్, డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, మహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం రుచికరంగా అందించేందుకు విద్యా శాఖాధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాలల్లో నాడు-నేడు ద్వారా పూర్తి స్థాయిలో నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాకుమాను రెసిడెన్సియల్ స్కూల్‌కు నీళ్లు లేవని, రూ.26 లక్షలు జెడ్‌పి నిధులతో నీళ్లు ఇవ్వటానికి చర్యలు తీసుకోవాలని కెఎస్ లక్ష్మణరావు మంత్రిని కోరారు. జెడ్‌పి హైస్కూల్స్‌లో పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం ఇస్తున్న విధంగా పట్టణ ప్రాంతాల్లోనూ అందించాలని కోరారు. బిసి స్టడీ సర్కిల్‌కు స్థలం కేటాయించాలని కోరగా, నెల రోజుల్లో కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అక్షయ పాత్ర ద్వారా భోజనం సరఫరా అవుతున్న పాఠశాలలను, స్థానిక ఏజెన్సీల ద్వారా భోజనం సరఫరా అవుతున్న పాఠశాలలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి భోజనం చేస్తున్న విద్యార్థుల వివరాల నివేదికను అందించాలని విద్యాశాఖకు మంత్రి ఆదేశించారు.

వైద్య సేవలను నిరంతరం పర్యవేక్షించాలి

వైద్యంపై సమీక్షలో తెనాలి ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ తెనాలి ప్రభుత్వ ఆసుపత్రి నుండి చిన్న చిన్న చికిత్సలకు సైతం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారని, దీని వల్ల పేషెంట్లు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. మంత్రి, కలెక్టర్ స్పందిస్తూ పూర్తి నివేదిక అందించాలని వైద్య, ఆరోగ్యశాఖాధికారుల్ని ఆదేశించారు. ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానం, పీహెచ్‌సీలలో ఓపిలు పెరిగేలా వైద్యాధికారులు పర్యవేక్షించాలని, వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారులకు పెన్షనర్లకు బిపి, షుగర్ మందులు పీహెచ్‌సి ద్వారా ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో సూపర్‌స్పెషాలిటీస్ డాక్టర్లను సరిపడా నియమించాలని కెఎస్ లక్ష్మణరావు కోరారు. వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లలో నిర్దేశిత సమయంలో సూపర్ స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మురుగుడు హనుమంతరావు కోరారు.

ఇళ్ల నిర్మాణాలకు రూ.5 లక్షలు కేటాయించాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలంటే కనీసం లబ్ధిదారులకు రూ.5 లక్షలు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. ఇప్పుడు ఇస్తున్న రూ.1.80 లక్షలు సరిపోవట్లేదని, దీంతో నిర్మాణాలు వేగవంతం కావట్లేదన్నారు. జిల్లాలో 62 వేల ఇళ్లు మంజూరైతే 45 శాతం ఇళ్లు మాత్రమే వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అన్నాబుత్తని శివకుమార్, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టిడ్కో ఇళ్లలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. నిర్మాణం పూర్తయిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించాలని, అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో సొంత స్థలాలు ఉన్న వారికి ఇళ్ల నిర్మాణాలు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్య వరప్రసాద్ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ సాంస్కృతిక కేంద్రంగా, పోటీపరీక్షల శిక్షణ కేంద్రంగా అభివృద్ధి చెందాల్సిన అంబేద్కర్ భవన్ నిర్మాణం ఆగిందని, రూ.10 కోట్లు కేటాయించి పూర్తి చేయాలని కోరారు. అంబేద్కర్ భవనం, గుర్రం జాషువా కళాపీఠం భవనాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి జిల్లా ప్రజలకు సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటుకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. పేదలందరికీ ఇళ్ల పథకంలో చేనేత కార్మికులు మగ్గాలు ఏర్పాటుకు అదనంగా ఒక సెంటు భూమి ఇవ్వాలన్నారు. వీటిపై కలెక్టర్ స్పందిస్తూ అంబేద్కర్ భవన్ నిర్మాణ పనులకు సంబంధించి నిధుల విడుదలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, గుఱ్ఱం జాషువ కళాపీఠం నిర్మాణానికి రీ ఎస్టిమేషన్లు ప్రభుత్వానికి అందిస్తామని చెప్పారు. సమాశంలో జెసి రాజకుమారి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తీ చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణశర్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రజక వృత్తిదారుల ఉపాధిపై దాడి హేయం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

విజయవాడలో రజకుల ఉపాధినీ దెబ్బతీయడం హేయమని రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విజయవాడ ముత్యాలమ్మపాడు రజక వృత్తిదారుల దోబీ ఖనాలో కులవృత్తి చేసుకుంటున్నా 100 కుటుంబాలు జీవనం సాగిస్తున్నారనీ దుస్తులు ఉతుక్కొని ఆరేసుకునే స్థలంలో రజకుల రేకుల షెడ్డును పడగొట్టి కొత్త నిర్మాణాలు చేపట్టాలని మున్సిపాలిటీ అధికారులు చేసిన చర్యలు దుర్మార్గం అని అన్నారు. ఇక్కడి రజకులు మూడు తరాలుగా కాలువ ఒడ్డునే కులవృత్తి చేసుకొని జీవన సాగిస్తున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే రజకులు వృత్తి స్థలాలపై అగ్రవర్ణాలు ధ్వంసం చేసి ఆక్రమించాలని ప్రయత్నాన్ని విరమించుకోవాలని

మాట్లాడుతున్న జూపూడి శ్రీనివాసరావు

అన్నారు. లేనిపక్షంలో ఉద్యమించాల్సిన అవసరం ఉందని జూపూడి శ్రీనివాసరావు తెలిపారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు దృష్టికి, మున్సిపాలిటీ కమిషనర్‌కు, జిల్లా కలెక్టర్‌కి దృష్టికి తీసుకెళ్లేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా నాయకులు వట్టికూటి సాంబయ్య, రజక జనసేవ సంఘం విజయవాడ నాయకులు జి. రాము ముత్యాలమ్మ పాడు రజక వృత్తిదారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కొండపల్లి ఆంజనేయులు, బెజవాడ రాములు పాల్గొన్నారు.

టెక్నికల్ ఎక్స్‌పోలో వివిఐటి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- తెనాలి

వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నంబూరు కళాశాల విద్యార్థులు టెక్నికల్ ఎక్స్పోలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ సంర్భంగా కళాశాలలో విద్యార్థులను బుధవారం వివిఐటి చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలోని ఇంజనీరింగ్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు సినాప్సిస్, అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాదులో అన్వేషణ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఫెయిర్ పేరిట నిర్వహించిన ఎక్స్పోలో వివిఐటి విద్యార్థులు ప్రదర్శనకు బహుమతి లభించిందన్నారు. ఎక్స్పోలో కళాశాల విద్యార్థులు డి.శశి కిరణ్, ఎం షాలోమ్ రాజు, షేక్ రేష్మ సుల్తానా, జి వెంకట జ్వాల పాల్గొని ఇంటర్నెట్ ఆఫ్

విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్, అధ్యాపక బృందం

థింగ్స్ అండ్ మిషన్ లెర్నింగ్ సాంకేతికతను ఉపయోగించి వ్యవసాయ ఉత్పత్తులు పెంపు, మొబైల్ రోబోట్‌ను ఉపయోగించి వ్యవసాయ పనిముట్లను సులభతరంగా ఉపయోగించే విధానాన్ని రూపొందించారు. విద్యార్థులకు రూ. 5వేలు నగదు బహుమతి కూడా లభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జున రెడ్డి, అకడమిక్స్ డీన్ డాక్టర్ కె. గిరిబాబు, అడ్మిన్ డీన్ డాక్టర్ ఎన్ కుమారస్వామి, సిఎస్ఓ విభాగాధిపతి డాక్టర్ సివిఎస్.సురేష్, ప్రొఫెసర్ డాక్టర్ కెవిఎల్ సోమశేఖర్ పాల్గొన్నారు.

మన్నుపోతున్నా మౌనమే..!

(మొదటి పేజీ తరువాయి)

అనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తవ్వకాలను ఎవరైనా ప్రశ్నిస్తే దాడులకూ మాఫియా వెరవడం లేదు. నరసరావుపేట నియోజకవర్గానికి చుట్టూ ఉన్న తుంగపాడు, పమిడిపాడు, కాకాని, మొలకలూరు, ఇక్కుర్తి, కోటప్పకొండ, గోనపూడి తదితర గ్రామాల నుండి గ్రావెల్ మట్టి అక్రమంగా తరలించారు. కొన్ని గ్రామాల్లో తాత్కాలికంగా నిలిపేసినా మరికొన్ని గ్రామాల్లో మట్టి మైనింగ్ కొనసాగుతూనే ఉంది. కోటప్పకొండకు పక్కనే ఉన్న గోనెపూడి కొండల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు కొనసాగుతుండగా ప్రతిరోజు పెద్ద ఎత్తున గ్రావెల్ టిప్పర్లు రాకపోకలు జరుగుతున్నాయి. లారీల హోరును తట్టుకోలేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదార్లు ధ్వంసమవడంతోపాటు పొలాలను దుమ్ము కమ్మేస్తోంది. వీటిపై అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 10కిపైగా లారీలను గోనెపూడి గ్రామస్తులు అడ్డుకున్నారు. గతంలో అక్రమ గ్రావెల్ మైనింగ్ చేస్తుండగా మైనింగ్ విజిలెన్స్ అధికారులు దాడులు చేసి మొక్కుబడిగా జరిమానా విధించారు తప్ప కఠిన చర్యలు తీసుకోకపోవడంతో మట్టి మాఫీ అక్రమార్కులు రెచ్చిపోతూనే ఉన్నారు. రెండేళ్లుగా నరసరావుపేట చుట్టూ అనేక గ్రామాల్లో గ్రావెల్ మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

కరుగుతున్న ఉండవల్లి కొండ

(మొదటి పేజీ తరువాయి)

తరలిస్తున్నారని, అయితే దీని వెనుక ఎవరున్నారో తెలీదని అంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలియకుండా ఇది జరుగుతుందా? అని ప్రశ్నిస్తున్నారు. పది టైర్ల భారీ వాహనాలతో రోజుకు వంద ట్రిప్పులు మట్టి, గ్రావెల్ తరలిపోతోంది. ఒక్కో లారీకి 30 టన్నుల మట్టి లోడ్ చేస్తున్నారు. ఒక్కో లారీ మట్టిని రూ.15 వేలకు అమ్ముకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ లెక్కన అక్రమార్కులు రోజుకు రూ.కోటిన్నర సంపాదిస్తున్నారు. కొండ మీద మట్టినంతా తరలిస్తుండడంతో ఇక్కడ పచ్చదనం కరువవుతోంది. కొండపై చిన్న మొక్క కూడా మొలిచే అవకాశం లేదని పలువురు ఆందోళన వెలిబుచ్చుతున్నారు. మరోవైపు పగలూరాత్రి తేడా లేకుండా లారీలు తిరగడంతో ఆ మోతలకు ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని స్థానికులు ఆవేదనకు గురవుతున్నారు. దుమ్మూధూళి ఇళ్లల్లోకి వస్తోందని, వండుకున్న ఆహార పదార్థాలపైనా పడుతోందని చెబుతున్నారు. దీనిపై తాడేపల్లి ఇన్‌ఛార్జి తహశీల్దార్ రామ్‌ప్రసాద్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. తాడేపల్లి తహశీల్దార్ వాకా శ్రీనివాసరెడ్డి ప్రమోషన్‌పై ఇటీవలే బదిలీ అవగా ఆయన స్థానంలో మంగళగిరి తహశీల్దార్ రామ్‌ప్రసాద్‌ను తాడేపల్లి తహశీల్దార్‌గా ఇన్‌ఛార్జిగా నియమించారు.

కాల్వల్లో పడి ఇద్దరు వృద్ధులు దుర్మరణం

ప్రజాశక్తి - రొంపిచర్ల

మండలంలోని బుచ్చిపాపన్నపాలెం, ఈపూరు మండలం ముప్పాళ్ళ గ్రామాల మధ్య గల కాలువలో పడి లస్కర్ మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని సంతగుడిపాడుకు చెందిన కొనికి చినవీరభద్రుడు (56) లస్కర్ గా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా బుచ్చిపాపన్నపాలెం-ముప్పాళ్ళ గ్రామాల మధ్య గల కాలువ వద్దకు వెళ్ళగా దురదృష్టవశాత్తు కాలువలో పడి మృతి చెందారు. కాలువలో మృతదేహాన్ని పొలాలకు వెళ్ళిన రైతులు గమనించి పోలీసులకు సమాచారం తెలియజేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలను పరిశీలించి చినవీరభద్రుడుగా గుర్తించారు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృత దేహాన్ని ఆయన బంధువులకు అప్పగించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సిహెచ్ సురేష్ బాబు తెలిపారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడు గ్రామానికి చెందిన రాచమంటి గంగయ్య (52) మంగళవారం పశువులు తీసుకొని పొలానికి వెళ్ళాడు. మధ్యాహ్నం వెళ్లిన ఆయన రాత్రి సమయం వరకూ ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు పంట పొలాలు, కాలువ వద్ద వెతికారు. బుధవారం ఉదయం యడ్లపాడు ఎస్సీ కాలనీ సమీపంలోని పెదనందిపాడు బ్రాంచ్ కాలువ గట్టుపై చెప్పులు చేతి కర్ర ఉండటంతో కాలువను పరిశీలించారు. కాలువ సంపు వద్దనీటిపై తేలుతూ గంగయ్య శవమై

కనిపించాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకని మృతదేహాన్ని బటయకు తీశారు. పోస్టుమార్టం కోసం చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే సాయంత్రం వేళ పశువులను శుభ్రం చేసేందుకు కాలువలోకి దిగి పొరపాటున నీటిలో మునగడంతో ఊపిరాడక మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. గంగయ్య కు భార్య తిరుమల, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనాలు సీజ్

ప్రజాశక్తి-నూజెండ్ల

వినుకొండ ఎస్ఇబి పరిధిలో నిర్వహించిన దాడిలో గుండ్లకమ్మ వాగు నుంచి ఇసుక ట్రాక్టర్లు ములకలూరు మీదుగా వినుకొండ పట్టణంలోకి వస్తుండగా మార్గమధ్యంలో వాటిని అడ్డుకున్నారు.అక్రమ ఇసుక రవాణాకు సంబంధించి సరైన బిల్లులు లేకపోవడంతో కేసు నమోదు చేశారు. డ్రైవర్లు ఎం.అశోక్, ఎం.మోషేలను అదుపులోకి తీసుకుని, ఆ ట్రాక్టర్లను ఐనవోలు పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు వినుకొండ ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ ఎ.నాగలక్ష్మి తెలిపారు. ఈ దాడిలో ఎస్ఇబి సబ్ ఇన్‌స్పెక్టర్ ,సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలి

అక్రమంగా ఇసుక 35 టన్నుల ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను ఎస్ఈబి అధికారులు సీజ్ చేశారు. గుంటూరు-హనుమాన్‌పాలెం రోడ్డులో కొలకలూరు పద్ద బుధవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు తనిఖీలు నిర్వహించారు. అనధికారికంగా ఇసుకతరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసి రూరల్ పోలీసులకు అప్పగించారు. అలాగే పరిమితికి మించిన లోడుతో వెళుతున్న మరో టిప్పర్‌కు రూ.10వేలు అపరాధ రుసుం విధించినట్లు ఎస్ఈబి అధికారులు తెలిపారు.

యువకుడు మృతి కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి-తెనాలి

యువకుడు మృతి కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. గతనెల 14న రూరల్ గ్రామం కొలకలూరులో పొన్నెకంటి శ్యామ్ సుందర్ పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసి, చికిత్స పొందుతూ అదే నెల 16న మృతి చెందాడు. అదేగ్రామానికి చెందిన గాజువర్తి బాబు, అతని కటుంబ సభ్యులతో ఉన్న పాతకక్షల నేపథ్యంలో వారు శ్యామ్ సుందర్‌పై దాడిచేసి, వేధింపులకు గురిచేయటంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు అతని కుటుంబసభ్యులు పోలీసులకు పిర్యాదుచేశారు. ఈ నేపథ్యంలో గాజులవర్తి బాబు, గాజులవర్తి ప్రేమ్‌సాగర్ అలియాస్ భన్ను, గాజులవర్తి రత్నకుమారి, మూల్పూరు రాజీవ్, మూల్పూరు మున్ని మరికొందరిపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుల్లో ఒర్కైన ప్రేమ్‌సాగర్‌ను బుధవారం అరెస్ట్ చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-తెనాలి

గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై పట్టణ ఒన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక పాత ప్రభుత్వ వైద్యశాల సమీపంలో రోడ్డు పక్కనే దాదాపు 60-65 సంవత్సరాల మద్య వయస్కుడు మృతి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతుని ఒంటిపై ఎర్రచొక్కా , నల్ల లుంగీ దరించి ఉన్నట్లు తెలిపారు.

రాష్ట్రాభివృద్ధికే ప్రాధాన్యం

ప్రజాశక్తి - తాడికొండ

రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని నియోజకవర్గం సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. తాడికొండలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో బుధవారం కన్వీనర్లు,గృహ సారథులు; వాలంటీర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. బడేపురం గ్రామంలో నీటి సమస్యను మహిళలు; ప్రజలు కత్తెర సురేష్ కుమార్ దృష్టికి తీసుకు రాగా ,స్పందించిన సురేష్ కుమార్ సంబంధిత అధికారులతో మాట్లాడి రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు అత్యవసరమైన తాగునీటిని వెంటనే అందించాలని అధికారులను ఆదేశించారు.

మాట్లాడుతున్న కత్తెర సురేష్‌కుమార్

ప్రచారాలకే పరిమితమైన ప్రభుత్వ పథకాలు

ప్రజాశక్తి-తెనాలి

ప్రభుత్వ పథకాలు ప్రచారాలకే పరిమితమౌతున్నాయని, రాజధాని విషయంలో ముఖ్యమంత్రి, మంత్రులది తలో మాటగా ఉందని జనసేన పిఏసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం పట్టణంలోని పలుప్రాంతాల్లో ఆయన పర్యటించి సభ్యత్వాలు నమోదు చేశారు. పలు అంశాలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రాజధాని విషయంలో ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. పాడైపోయిన రోడ్లను నాలుగేళ్లుగా బాగుచేయలేని ప్రభుత్వం రాజధానిని ఎలా నిర్మిస్తుందన్నారు. రాజధానిపై ప్రభుత్వం రోజుకో మాట మాట్లాడుతుండటంతో పెట్టుబడి దారులు రావటం లేదని, ఫలితంగా పరిశ్రమలు రాక యువత భవిష్యత్ నిర్వీర్యమైపోతోందన్నారు. ఆయన వెంట నాయకులు టి.వెంకటరమణరావు, మాజీ కౌన్సిలర్ జాకీర్, బండారు రవికాంత్, ఇస్మాయిల్ భేగ్, పసుపులేటి మురళీకృష్ణ కె.రజని, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు 6 నెలల జైలు

ప్రజాశక్తి-మంగళగిరి

నిర్లక్ష్యంగా ఆటో నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి..ఇద్దరిని గాయాలపాలు చేసిన కేసులో ఆటో డ్రైవర్ కు 6 నెలల జైలు శిక్ష విధిస్తూ మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బుధవారం తీర్పు ఇచ్చింది. 19-11-2016న ఉదయం తొమ్మిది గంటల సమయంలో నిడ్రమర్రు రైల్వే గేటు సమీపంలో మంగళగిరి మండలం నిడమర్రు గ్రామానికి చెందిన కుర్రా శ్రీనివాసరావు ఆటోను వేగంగా నిర్లక్ష్యంగా నడుపుతూ వెనుక నుండి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టాడు. ఈ ఘటనలో చినకాకానికి చెందిన అద్దంకి వెంకటేశ్వర్లు, పాత మంగళగిరికి చెందిన మేడూరి చిన్న మార్క్‌లకు దెబ్బలు తగిలాయి. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.వినోద్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్. నాగమణి వాదనలు వినిపించారు. శ్రీనివాసరావుపై నేరం రుజువు కావడంతో ఆరు నెలల జైలు శిక్ష ను విధిస్తూ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి. శ్రీప్రత్యూష తీర్పు నిచ్చారు.

మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	: 1,30,195
మిర్చి ఎగుమతి	: 1,38,237
మిర్చి నిల్వ	: 86,335

మిర్చి ధరలు

రూపాయలలో

334	7,000 - 19,500
నెం.5	8,000 - 20,000
273	15,000 - 20,000
341	7,500 - 21,500
4884	14,000 - 19,000
సూపర్ 10	15,000 - 18,500
నాన్ ఎసి	
తేజ	7,000 - 20,500
బడిగి	7,500 - 25,000
దేవనూరు డీలక్స్	8,000- 23,000
తాలుకాయలు	4,000 - 12,500

LOSS OF PASSPORT

I, **ATMAKURI VENKATA SATISH KUMAR** S/O Rajendra Prasad, Age. 35 yrs, Resident of D.No.4-1-40/5, Paturu,Narasaraopet Town, Palnadu Dist., A.P. - 522601. I Lost my Original Passport bearing No. G8877746 while I was travelling from Thallurivari Street to Pathuru Anjaneyaswamy Temple on bike. After Several attempts I could not trace it out. If anybody find please contact below Number.

ATMAKURI VENKATA SATISH KUMAR CELL : 8639114577

NAME CHANGE

I Neelam Vijayalakshmi, W/o. Neelam Ramakrishna Rao, HSNo-1-120, Uyyandana, Krosuru, Guntur, A.P. 522410, Have Change my name Neelam Vijayalakshmi to **Neelam Lakshmi** for all purposre

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఐ.ఎ.నెం. 1398/2022 ఇన్ ఓ.ఎస్. 899/2022

పాలడుగు రామకృష్ణారావు - పిటిషనరు /వాది
ఎదిరి
1. దావులూరి రామకృష్ణ
2. ఆకుల కోటేశ్వరరావు వురఫ్ ఎ.కె.
- రెస్పాండెంట్లు-ప్రతివాదులు

2వ రెస్పాండెంటు / ప్రతివాది: ఆకుల కోటేశ్వరరావు వురఫ్ ఎ.కె., తండ్రి వెంకటేశ్వర్లు, వ్యాపారం, పెంట్‌హౌస్, సూర్యకృష్ణ బృందావనం, ఫర్టిలైజర్సు షాపు రోడ్డు, మారీసుపేట, తెనాలి-2.

పై నెంబరు దావాలోని ఐ.ఎ. నెం. 1398/2022 అనగా ఇంజక్షన్ పిటీషనులో మీకు శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం అనేక పర్యాయములు నోటీసులు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు ఈ నోటీసు యివ్వడమైనది. సదరు నోటీసు ప్రకారం ది. 27-02-2023 ఉదయం 10.30 ని॥లకు శ్రీయుత కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ తరుపు న్యాయవాది ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల సదరు దావాలోని ఐ.ఎ. నెం. 1398/2022 ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 27-02-2023

తాడిబోయిన శ్రీనివాసరావు
వాది తరుపు న్యాయవాది
తెనాలి

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 899/2022

పాలడుగు రామకృష్ణారావు - వాది
ఎదిరి
1. దావులూరి రామకృష్ణ
2. ఆకుల కోటేశ్వరరావు వురఫ్ ఎ.కె. -ప్రతివాదులు

2వ ప్రతివాది: ఆకుల కోటేశ్వరరావు వురఫ్ ఎ.కె., తండ్రి వెంకటేశ్వర్లు, వ్యాపారం, పెంట్‌హౌస్, సూర్యకృష్ణ బృందావనం, ఫర్టిలైజర్సు షాపు రోడ్డు, మారీసుపేట, తెనాలి-2.

పై నెంబరు దావాలో మీకు శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం అనేక పర్యాయములు దావా సమన్లు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీయుత కోర్టు వారు ఉత్తర్వుల ప్రకారం ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు ఈ దావా సమను యివ్వడమైనది. సదరు దావా సమను ప్రకారం ది. 27-02-2023 ఉదయం 10.30 ని॥లకు శ్రీయుత కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ తరుపు న్యాయవాది ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల సదరు దావాను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ యుత కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 27-02-2023

తాడిబోయిన శ్రీనివాసరావు
వాది తరుపు న్యాయవాది
తెనాలి

NOTICE
IN THE COURT OF THE 1ST ADDL. DISTRICT JUDGE: GUNTUR
O.S. 96/2018

Between:
Shaik Guljar Bi & 6 others - **Plaintiffs**
and
Shaik Jani Saheb (died) & 27 others - **Defendants**

To,
Defendant No: 12: Shaik Masthan, S/o. Shaik Quary Jany, Vejendla (PO), Chebrole Mandal, Guntur District- 522213
Defendant No. 27: Smt. Shaik Shakeera W/o. Patan Nagur Basha C/o. Shaik Patan Bude, Right Side to Kotta Police Station, Jenda Chettu Bazar last, Chebrole (PO) & (M)Guntur District - 522212.

పై నెంబరు దావా నందు వాదులు ప్రతివాదులపై పార్టీషన్ దావా వేసియున్నారు. తదుపరి శ్రీకోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది.23-02-2023 వ తేది ఉదయం 10.30ని॥లకు వాయిదా వేసియున్నారు. కనుక మీరు కాని మీ వకీలు ద్వారా కాని ఆరోజు ఉదయం 10.30. ని॥లకు కోర్టుకు హాజరు కావలసియున్నది. లేని ఎడల పై నెంబరు దావా ఓ.యస్. 96/2018 నందు మీ పరోక్షమున తీర్మానము చేయబడునని ఇందుమూలముగా శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం తెలియజేయటమైనది.
వాయిదా తేది: 23-02-2023

యస్. సుధాకర్ రెడ్డి
అడ్వకేటు
డోర్ నెం. 4-5-32/15 బి
1వ లైను, విద్యానగర్, గుంటూరు-522007.
సెల్: 9848220505

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు వాహన దారులకు విజ్ఞప్తి చేశారు.రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమ, నిబం ధనలపై సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు బుధవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల్లో భాగంగా సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్,సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి డి. నాగ వెంకటలక్ష్మి సూచనల మేరకు స్థానిక అమరావతి బస్టాండులో ఆటో డ్రైవర్లకు, వాహన దారులకు, ప్రజలకు ట్రాఫిక్ నియమ నిబంధ నలపై అవగాహన కల్పించారు. వాహనచోదకులు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని, వాహన యజమానులు సకాలంలో ఇన్సూరెన్స్ చెల్లించాలని, సీట్ బెల్టు,హెల్మెట్ ధరించాలని, పరిమితికి మించి వాహనంలో ప్రయా ణికులను ఎక్కించ వద్దని, గూడ్స్ ఆటోల్లో ప్రయాణికులను అనుమతి లేదని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు యు. పాపారావు ,బి.ఎల్ లక్ష్మీ కోటేశ్వరరావు, పారా లీగల్ వాలంటీర్లు షేక్ సుబాని, షేక్ ఖాజా, పట్టణ ఎఎస్ఐ మూర్తి, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బీమా గ్రామంగా నడిగడ్డ

ప్రజాశక్తి-వినుకొండ

మండలంలోని నడిగడ్డ గ్రామాన్ని ఎల్ఐసి బీమా గ్రామంగా ప్రకటించి లక్ష రూపాయలు పంచాయతికి అందజేస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్ లక్ష్మానాయక్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఎల్ఐసి లక్ష రూపాయలు చెక్కును సర్పంచ్ దేవర సంతోషంకు అందజేశారు. బి ఎం మాట్లాడుతూ ఒక ఏడాదికి ఆ గ్రామంలో 100 పాలసీలు చేసినట్లయితే ఆ గ్రామాన్ని బీమా గ్రామంలో తీసుకోవడం జరుగుతుందన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ ఎల్ఐసి అంద జేసిన లక్ష రూపాయల నిధులను గ్రామానికి సోలార్ విద్యుత్ దీపాలను కొనుగోలు చేసి ఏర్పాటు చేయడం జరుగుతుం దన్నారు. డివో వాసు మాట్లాడుతూ ఎల్ఐసి చేయ టం వల్ల కలిగే ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో ఏజెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్ చెరుకూరి హరనాథ్ బాబు,సెక్రటరి కాకుమాను కోటేశ్వరరావు, గ్రామానికి అవార్డు రావడానికి కారణమైన పాలడుగు నాగ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

భూ రీసర్వేకు సహకరించండి

రికార్డులను పరిశీలిస్తున్న తహాశీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్

ప్రజాశక్తి-ఈపూరు

భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం జగనన్న భూ హక్కు భూ రక్ష పథకంలో భాగం గా భూముల రీ సర్వే చేపడు తోందని తహాశీల్దార్ రామా వత్ వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. మండలంలోని కొం డ్రముట్లలో జరుగు తున్న రీసర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. రికార్డులను పరిశీలించి సచివాలయ సర్వేయర్లు, గ్రామ రెవిన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. భూ రీ సర్వేతో రైతు లకు జరిగే మేలు గురించి వివరించారు. మండల సర్వే యర్ పి.చండీ రాణి, విఆర్ఒ పిచ్చయ్య పాల్గొన్నారు.



కళ్యాణ కానుకను ఎంతమందికైనా ఇస్తాం

డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్

ప్రజాశక్తి - మాచవరం

ఆడబిడ్డలను ఆదుకోవడంలో ఆనందం వుందని పల్నాడు హాస్పిటల్స్ అధినేత డాక్టర్ అశోక్‌కుమార్ చింతలపూడి అన్నారు. మాచవరం మండలం మోర్జంపాడులో బుధవారం హలో నేస్తం (మన ఆడబిడ్డ - మన బాధ్యత) పేరుతో చింతలపూడి ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు చింతలపూడి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కళ్యాణ కానుక కార్యక్రమాన్ని చింతలపూడి బ్రదర్స్ నిర్వహించారు. డాక్టర్ అశోక్ కుమార్, రమ్యహారిక దంపతులుఈ సంద ర్భంగా పెళ్లి కుమార్తె ముద్దా అనితాజ్యోతికి కళ్యాణ కానుకను అందించి ఆశీర్వదించారు. కుల,మతాలకు అతీతంగా ఆడబిడ్డలకు అం డగా, అన్నగా ఉండాలని భావించి చీర, బంగారపు తాళిబొట్టు, పసుపు, కుంకుమ, గాజులు, పూలు ఇస్తున్నట్లు వారు చెప్పారు. పెళ్లి నిమిత్తం గురజాల నియోజకవర్గంలో తమ ట్రస్ట్ ని సంప్రదించిన వారికి రాజకీయాలకు అతీతంగా ఎంత మందికైనా ఈ కానుక కిట్‌లను అందిస్తామని అన్నారు. అనంతరం, మాచవరం మండలం వేమవరం లో సూరం తేజస్విని అనే నూతన వధువుకు కళ్యాణ కానుక కిట్‌ను అశోక్ కుమార్ దంపతులు అందజేశారు. కార్యక్రమంలో చింతల పూడి సైన్యం, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-మాచర్ల

సుద్దగుంతల 33/11కెవి సబ్ స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డిఇఇ ఎ రామయ్య తెలిపారు. సబ్ స్టేషన్ ఆవరణలో 8ఎంవిఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ఉదయం మారుస్తున్న నేపథ్యంలో సబ్‌స్టేషన్ పరిధిలోని బస్టాండ్, రామా టాకీస్ లైన్, రైల్వే స్టేషన్ రహదారి, నెహ్రూనగర్, గుంటూరు రహదారి, సుద్దగుంతల ఏరియా తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంశాన్ని గుర్తించాలని కోరారు.

కోటప్పకొండకు పురపాలక సంఘం ప్రభ సిద్ధం

ప్రజాశక్తి-నరసరావుపేట

మహా శివరాత్రిని పురస్కరించుకుని నరసరావుపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభ కోటప్పకొండ వెళ్లేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.దీనికి సంబంధించిన ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ డి. రవీంద్ర, డిప్యూటీ ఇంజినీర్ శ్రీనివాసరావులు పరిశీలించారు. ప్రతి శివరాత్రికి పట్టణం నుండి ముందుగా బయలుదేరే పద్ధతి కొన్నేళ్లుగా ఆనవాయితీగా నిర్వహిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో పురపాలక సంఘం అధికారులు, కాం ట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాచవరంలో విద్యార్థుల సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి - మాచవరం

ఆజాద్ కి అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిరోజు సైక్లింగ్, వ్యాయామం చేస్తే.. ఏ కారణం చేతనైనా మరణించే ప్రమాదాన్ని 41 శాతం, కేన్సర్ సంబంధిత మరణాలను 45 శాతం, గుండె జబ్బుల ద్వారా సంభవించే మరణాలను 46 శాతం వరకు అరికట్టవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ ప్రసాద్, రత్తయ్య, ఆరోగ్య విస్తరణ అధికారులు పట్టాభి,సురేష్, హెల్త్ సూపర్‌వైజర్లు, వివిధ గ్రామాల ఎంఎల్‌హెచ్‌పిలు, ఉన్నత పాఠశాల పిఇటి, ఎఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదర్శ పాలకుడు దామోదరం సంజీవయ్య

ప్రజాశక్తి - చిలకలూరిపేట

నాడు రాష్ట్రమంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా అనిర్వచనీయమైన సేవలందించిన మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ఆదర్శ ప్రజా పాలకుడని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి, రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎం.రాధాకృష్ణ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 102వ జయంతి కార్యక్రమం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో స్థానిక పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.ప్రసన్న అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సంజీవయ్య చిత్ర పటానికి రిటైర్డ్ ఆర్మీ సుబేదార్ మేజర్ కేతావతు మంత్రు నాయక్, నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, యడ్లపాడు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పి.రవి, జిల్లా సంచార జాతుల కాంగ్రెస్ విభాగ అధ్యక్షుడు నటరాజ వెంకటేష్ తేవర్, బిసి నాయకులు కె.శ్రీహరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి, అంబేద్కర్ మార్గంలో నడిచి, పేద ప్రజల జీవితాలలో వెలుగులు నింపడం కోసం దామోదరం సంజీవయ్య అహర్నిశలు శ్రమించారని ప్రశంసించారు. దేశంలో మొట్టమొదటిసారిగా అవినీతి నిరోధక శాఖను ఏర్పాటు చేసిన వ్యక్తి ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ ఫక్రుద్దీన్, షేక్ సిరాజ్ ,సయ్యద్ సజాద్, ఎస్.హరిబాబు, ఎం.వెంకటరత్నం, డి.శ్యాంబాబు, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎ.ఈశ్వర్, భారత జాతీయ విద్యార్థి సంఘం పట్టణ అధ్యక్షుడు షేక్ బాషా, షేక్ మస్తాన్ వలి, బి. కోటయ్య, షేక్ బాజీ పాల్గొన్నారు.

పిచ్చికుక్క కాటుకు గురైన తల్లీబిడ్డ

ప్రజాశక్తి - రెంటచింతల

వీధి కుక్కలు చెలరేగిపోతున్నాయి. కొత్తవాళ్లు కనపడితే ఎగబడి కరుస్తున్నాయి. వీధి కుక్కల దాటికి ప్రజలు బెంబేలెత్తుతున్నారు సాయంత్రం వేళలో బయటికి వెళ్లాలంటేనే భయపడుతున్నారు మంగళవారం రాత్రి మండలంలోని మెట్టుగుడిపాడులో దళితవాడలో ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. తల్లి కర్ర కోటమ్మ బిడ్డ అనిల్. కళ్లెదుట తన ఐదేళ్ల బిడ్డను పళ్ళతో రక్కుతుండగా అడ్డు వెళ్లింది. ఆమె ఎడమ చేతిపై, అనిల్ పెదాలపై కుక్క కరిచింది.

మాచర్లలోని ప్రభుత్వాసుపత్రికి వెళ్లిన తల్లీబిడ్డను హెచ్‌ఆర్ఐజి ఇంజక్షన్ చేయించుకున్నారు. ఇదిలా ఉండగా, జనవరిలో 54 మంది వీధి కుక్కల కాటుకు గురై ఇంజక్షన్లు చేయించు కున్నారు. ఫిబ్రవరిలో ఇప్పటివరకు 28 మంది బాధితులు యాంటీ రాబిస్ ఇంజక్షన్లు తీసు కున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. విద్యార్థులు పరీక్షల సమయంలో రాత్రి పూట ట్యూషన్లకు వెళ్లి వచ్చేటప్పుడు వీధి కుక్కల కారణంగా వారు భయాందోళనలకు గురవుతున్నట్లు వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన సైన్స్ ఫెయిర్

• రాష్ట్ర స్థాయికి పది ప్రాజెక్టులు ఎంపిక

విద్యార్థులను అభినందిస్తున్న జెసి, ఇతర అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేటలోని సెయింట్ ఇగ్నీషియస్ బాలికోన్నత పాఠశాలలో రెండ్రోజులపాటు విద్యాశాఖ నిర్వహించిన జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన బుధవారం ముగిసింది. ఈ ప్రదర్శనలో ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ యం.శేషగిరిరావు, నగర డిప్యూటీ మేయర్ షేక్.సజీల, పాఠశాల విద్య ఆర్‌జెడి వి.ఎస్.సుబ్బారావు, డిఇఒ పి.శైలజ తదితరులు హాజరై విద్యార్థులను అభినందించారు. రాష్ట్ర స్థాయిలోనూ మెరుగైన ప్రతిభ చూపాలని సూచించారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి కె.సుధాకర్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రాయపాటి శివనాగేశ్వరరావు, ఎంఇఒ ఖుద్దూస్, ఉర్దూ డిఐ ఖాసిం, హెచ్‌ఎం సిస్టర్, రాణి తదితరులు పాల్గొన్నారు. ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్ విభాగంలో రాయపూడి జెడ్పీహైస్కూల్ విద్యార్థి లోహిత్ రూపొందించిన ప్లాస్టిక్‌తో, ప్లాస్టిక్ లేకుండా ప్రపంచ అనే నమూనా, అత్తోట జెడ్పీ హైస్కూల్ విద్యార్థి యం.చరణ్‌సాయి రూపొందించిన బెస్ట్ ఫ్రమ్ వేస్ట్ ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. అదే విధంగా హెల్త్ అండ్ క్లీనెస్ విభాగంలో పొన్నూరుకు చెందిన షేక్.సనాభూష్రా రూపొందించిన స్మోకింగ్ ఈస్ ఇంజ్యూరియస్ టు హెల్త్, ముట్లూరు జెడ్పి హైస్కూల్ విద్యార్థిని రిషిత రూపొందించిన స్మార్ట్ బేబీ ఫ్రెండ్లీ క్రాడిల్ ఎంపికయ్యాయి. సాఫ్ట్‌వేర్ అండ్ యాప్స్ విభాగంలో ఎస్‌జెఆర్‌ఆర్‌ఎం ఎంసిహెచ్‌ఎస్, గుంటూరు విద్యార్థి ఎన్.శేఖర్ రూపొందించిన ఆటోమేటిక్ శానిటైజర్ మెషిన్, ముట్లూరు జెడ్పిహెచ్‌ఎస్ విద్యార్థి జి.స్టీఫెన్ పాల్ రూపొందించిన ఆటోమేటిక్ సోలార్ స్ట్రీట్‌లైట్ ప్రాజెక్ట్ ఎంపియ్యాయి. పర్యావరణం, వాతావరణ మార్పులు విభాగంలో అత్తోట జెడ్పిహెచ్‌ఎస్ విద్యార్థి పి.జుషేంద్ర అభినాష్ రూపొందించిన రెయిన్ డిటెక్టర్, ముట్లూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని ఎన్.దివ్యశ్రీ రూపొందించిన క్లైమెట్ ఛేంజ్, ఎన్విరాన్‌మెంటల్ ప్రాజెక్ట్‌లు ఎంపికయ్యాయి. మేథమెటికల్ మోడలింగ్ విభాగంలో అత్తోట జెడ్పీహైస్కూల్ విద్యార్థి ఎ.గోవర్ధ నాయుడు రూపొందించిన మేథమెటిక్స్ ప్రూఫ్స్, నిడుబ్రోలు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి పి.అమ్రీన్ రూపొందించిన రియల్ ఫ్యామిలీ ప్రాజెక్ట్‌లు రాష్ట్ర స్థాయికి ఎంపిక అయ్యాయి.

మహిళలతో మాట్లాడుతున్న దొంతిరెడ్డి వెంకటరెడ్డి

చెరువు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం చెరువు ప్రాంతంలో సమగ్రంగా రోడ్లు నిర్మాణం చేపట్టాలని సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం చెరువు ప్రాంతంలో రోడ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు వెంకటరెడ్డిని కలిసి రోడ్లు సరిగా లేనందున పరిసరాలలో వాడిన మురుగు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతుందని తెలిపారు. వర్షాలు కురిసే సమయంలో రోడ్లు పల్లంగా ఉండడం వలన వర్షపు నీరు నిలిచి, రాత్రి వేళల్లో దోమలు అధికంగా ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వెంకటరెడ్డి మాట్లాడుతూ పేదల నివసించే చెరువు ప్రాంతంలో సరైన మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చెరువు ప్రాంతంలో రోడ్లన్నీ సమగ్రంగా వేయాలని, డ్రైన్లు నిర్మాణం చేపట్టి, మురుగునీటిని బయటికి పంపే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. అదేవిధంగా చెరువు నుండి, మరో రోడ్డుకు వెళ్లే లింకు రోడ్లను పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులను అధికారులు నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పేదలు రోగాల బారిన పడకుండా మురుగునీరు నిలిచిన చోట బ్లీచింగ్ చల్లి, దోమల ఫాగింగ్‌కు తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వడ్డేశ్వరం మరియదాసు, శివమ్మ, వంగూరు రత్తమ్మ, సునీత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌విఆర్ అండ్ జెసి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు: ఆదిత్రి కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాల విద్యార్థులు ఆరుగురు ఉద్యోగాలు సాధించారని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బి.టెక్ సివిల్ ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న జి.వెంకటేష్, యం.యేసునాయక్, కె.అమృత వర్షిణి, ఆర్.బాబు, టి.పవన్ కృష్ణచైతన్య, వి.శ్రవణ్ కుమార్ ఉద్యోగాలు పొందారన్నారు. ఇప్పటి వరకూ వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన వారి సంఖ్య 1048కి చేరిందన్నారు. ఆయా విద్యార్థులకు కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, సివిల్ విభాగాధిపతి డాక్టర్ ఎం.రామారావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు సిహెచ్ .శ్రీనివాసరావు, వి.జగదీష్ అభినందనలు తెలిపారు.

రాష్ట్రాల హక్కులను హరిస్తున్న కేంద్రం

భీమవరపు లక్ష్మారెడ్డి వర్ధంతి సభలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

రాష్ట్రాల హక్కులను కేంద్రం హరిస్తుందని సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు పేర్కొన్నారు. మండలంలోని ఖాజా గ్రామంలో భీమవరపు లక్ష్మారెడ్డి వర్ధంతి సభ మంగళవారం రాత్రి టి.ప్రసాదరెడ్డి అధ్యక్షతన జరిగింది. లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జెవి రాఘవులు మాట్లాడుతూ కేంద్రం రాష్ట్ర హక్కులను హరించడం, కార్పొరేట్లకు ఊడిగం చేయడం, రాజకీయ కక్షా సాధింపులకు పాల్పడడం ,వ్యవస్థలన్నింటిని నాశనం చేయడం తప్ప మరొక ప్రయోజనకరమైన పని చేయడం లేదన్నారు. విపక్షాలను ప్రతిపక్షాలను లేకుండా చేసి రాజ్యమేలాలని ఆకాంక్షతో కక్ష సాధింపులకు దిగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటుపరం చేస్తూ కార్పొరేట్లకు అప్పనంగా అప్పగించేస్తుందని దుయ్యబట్టారు. ప్రజలపై పన్నుల రూపంలో భారాలను మోపుతున్నారని తెలిపారు. సబ్సిడీలను రద్దు చేస్తూ రైతులను నట్టేట ముంచే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వ్యవసాయంతో పాటు పారిశ్రామిక రంగాలకు నిధుల కేటాయింపు బడ్జెట్లో లేదన్నారు. ఫలితంగా నిరుద్యోగం భారీగా పెరిగిపోయిందన్నారు. ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్లో నిధుల తగ్గింపు చేశారన్నారు. పారిశ్రామిక వ్యవసాయ రంగాల అభివృద్ధి, ఉపాధి కల్పన చేయాలన్న ఆకాంక్ష లేకుండా పోయిందన్నారు. ఎన్నికలలో గెలవడం పై

సభలో మాట్లాడుతున్న జెవి.రాఘవులు

శ్రద్ధ వహించడం ఓడిపోతే విపక్షాలను కొనుగోలు చేయడం తద్వారా అధికారాన్ని కాజేయడం మినహా బీజేపీ చేస్తుంది ఏమీ లేదన్నారు. అటువంటి కేంద్రాన్ని నిలదీయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాలు కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ వారికి తొత్తులుగా నిలవడం బాధాకరమన్నారు. ఈ క్రమంలో ప్రజాస్వామ్యవాదులు, అభ్యుదయవాదులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ వైఖరులను ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇదే భీమవరపు లక్ష్మారెడ్డికిచ్చే నిజమైన నివాళిఅని ఆయన పేర్కొన్నారు. ఈ వర్ధంతి సభలో సిపిఎం సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ ఈద నాగేంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఈదా ప్రతాపరెడ్డి, ఆళ్ల సాంబిరెడ్డి అప్పికట్ల ప్రకాశరావు, సింహాద్రి సుమ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతోనే దేశాభివృద్ధి

ప్రజాశక్తి- మేడికొండూరు

నూతన అవిష్కరణలతోనే దేశాభివృద్ధి జరుగుతుందని ఈ- టెక్నాలజీ వ్యవస్థాపకులు అఖిలేష్ శ్రీవాస్తవ అన్నారు. బుధవారం మండలంలోని విశదల అడ్డరోడ్డు వద్ద గల ఎన్‌ఆర్‌ఐ ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఈ - టెక్నాలజీ పై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ మనదేశంలో ఈ -టెక్నాలజీ ద్వారా ఫాస్ట్ స్టాగ్ రూపకల్పన జరిగిందని తెలిపారు. ఈ ఆధార్, రోడ్ సేఫ్టీజం, రూపకల్పనలో ప్రముఖ పాత్ర పోషించామని తెలిపారు. దేశాభివృద్ధికి నూతన

శ్రీ వాస్తవను సన్మానిస్తున్న కళాశాల సెక్రటరీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

ఆవిష్కరణలు జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మనదేశంలో నూతన ఆధునిక సాంకేతిక టెక్నాలజీ అభివృద్ధి చెందడం ద్వారా యువతకు ఉపాధి దొరుకుతుందని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ఆటో మెషిన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ ఇంజిన్, డిజైన్ సొల్యూషన్ పై ప్రతి విద్యార్థి అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమకు ఎదురైనటువంటి పలు రకాల సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కోటా శ్రీనివాసు, కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిడి తిలక్ బాబు, ఏఓ సీతారామయ్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీహరి, పలు విభాగాల అధ్యాపకులు డాక్టర్ చంద్రమౌళి ,డాక్టర్ రెహమాన్, కోటేశ్వరరావు, రవికుమార్, సుజాత, పలువురు బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పిఎఫ్ బకాయిలు చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి -ప్రత్తిపాడు

ప్రతి నెల 1వ తేదీ జీతాలు చెల్లించడంతో పాటు 10 నెలల నుండి పేరుకుపోయిన పీఎఫ్ బకాయిలు చెల్లించాలని ఎపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ప్రత్తిపాడు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు చేపట్టిన నిరసన ప్రదర్శన ఆయన పాల్గొని మాట్లాడుతూ మూడేళ్ల నుండి బదిలీలు జరపకుండా ఉండి 6000 కోర్టు కేసులు పడేటట్లు బదిలీల జీఓ రూపొందించారని దుయ్య బట్టారు. ఎన్నికల హామీ అయిన సీపీఎస్ రద్దు చేయకపోవడం రెండు లక్షల సీపీఎస్ ఉద్యోగులను మోసం చేయడమేనన్నారు. ఉపాధ్యాయులుకు పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు గత పది నెలలనుండి చెల్లించచలేదన్నారు. వెంటనే జాప్యం లేకుండా పీఎఫ్ రుణాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 3,4,5తరగతుల విలీన ప్రక్రియను రద్దు చేయాలని కోరారు. అలవెన్సు పదోన్నతల స్తానంలో ఇంక్రిమెంట్స్ కూడిన శాశ్వత పదోన్నతుల ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డ్స్ మంజూరు చేయాలన్నారు. ప్రదర్శన అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో సూపరెంటెండెంట్ కి మెమోరండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరెడ్డి, వి.మరియరాజు, జిల్లా ఉపాధ్యక్షులు టి. రామలీల, జిల్లా కార్యదర్శి ఎన్. రాంబాబు, ఎన్. అంకారావు, ప్రసాదరావు, కె.నారాయణ, వరప్రసాద్, శ్రీనివాసరావు, మాధవి, లక్ష్మీ, శ్యాముల, అరుణ, బాజి, భారతి, తదితరులు పాల్గొన్నారు.

అధ్యయనంతో ఏదైనా సాధ్యమే

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జాతీయ స్థాయి విజ్ఞాన మహోత్సవం-2023 బుధవారం వైభవంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యూత్ సర్వీసెస్ అండ్ స్పోర్ట్స్, యూత్ అడ్వాన్స్‌మెంట్ టూరిజం అండ్ కల్చర్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ జీ.వాణీమోహన్ (ఐఏఎస్) మాట్లాడుతూ విద్యార్థులు నిరంతర అధ్యయనంతో ఏదైనా సాధించవచ్చునని పేర్కొన్నారు. జీవితంలో ఏవైనా కొత్తవి నేర్చుకోవడానికి ఆలస్యం చేయకూడదన్నారు. జీవితంలో ప్రతి విద్యార్థి ఏదో ఒకటి సాధించేలా ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. చదువుకే పరిమితం అవ్వకుండా యోగ, సంగీతం, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో ముందు వరుసలో ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మాట్లాడుతూ యువత తన శక్తిని వెలికితీసి భారతదేశ ఖ్యాతిని ఇనుమడింపజేయాలని

మాట్లాడుతున్న చీఫ్ సెక్రెటరీ డాక్టర్ వాణీమోహన్

అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ ప్రసంగించారు. విజ్ఞాన్ మహోత్సవంలో భాగంగా క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో మొత్తం 82 ఈవెంట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ వైస్‌చైర్మన్ లావు శ్రీకష్ణదేవరాయలు పాల్గొన్నారు.

కొండ వద్ద పార్కింగ్ కోసం యాప్

- కోటప్పకొండ తిరునాళ్లపై ఐజి సమీక్ష
- 90 అడుగులు దాటిన ప్రభ వద్ద ఇద్దరు పోలీసులు
- కుల, రాజకీయ పాటలు నిషేధం

ప్రజాశక్తి - నరసరావుపేట

మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 18న కోటప్పకొండ తిరునాళ్ల నేపథ్యంలో వాహనాల పార్కింగ్ కోసం యాప్‌ను రూపొందించినట్లు ఐజి త్రివిక్రమ వర్మ తెలిపారు. తిరునాళ్లకు బందోబస్తు, ఇతర ఏర్పాట్లపై పోలీస్ అధికారులతో స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఆయన బుధవారం సమీక్షించారు. కోటప్పకొండకు ప్రభలు వచ్చే సమయంలో యడవల్లి, కమ్మవారిపాలెం జంక్షన్ల వద్ద విద్యుత్ శాఖ సహకారంతో హైవోల్టేజ్ విద్యుత్ వైర్లను తాత్కాలికంగా తొలగించాలని, యుటి జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటూ, 90 అడుగులు మించి వచ్చే ప్రభల వద్ద ఇద్దరు పోలీస్ సిబ్బందిని పర్యవేక్షణకు పెట్టాలని చెప్పారు. ప్రభల మధ్య తగిన దూరం ఉండేలా చూడ్డంతోపాటు రాజకీయ, సామాజిక తరగతులకు చెందిన పాటలు పెట్టకుండా చూడాలన్నారు. శాంతి భద్రతలకు భంగం రాకుండా అనుమానితులను బైండోవర్ చేయాలని, ప్రభల వద్ద సాంస్కృతిక కార్యక్రమాల్లో అశ్లీలతకు తావివ్వొద్దన్నారు. రోడ్లకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించాలని, ట్రాఫిక్ నియంత్రణపై పటిష్ట ప్రణాళిక రూపొందించాలని, కొండకు వచ్చే దారుల్లో వాహనాలు ఏమైనా ఆగి సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరించడానికి పొక్లెయినర్లు, జెసిబిలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రాధాన్యత కలిగిన జంక్షన్ల వద్ద సందర్శకుల రద్దీ, వాహన రాకపోకలపై సిసి కెమెరాలు, కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించాలన్నారు.

పార్కింగ్ కోసం యాప్

కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చే వారు తమ వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన కోటప్పకొండ పార్కింగ్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఐజి కోరారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు, కార్లు, బస్సులు మొదలగు వాహనాలకు కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల గురించిన సమాచారం యాప్‌లో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కార్యాలయ పరిసరాలను, పోలీస్ సిబ్బందికి ఏర్పాటు చేసిన వెల్ఫేర్ క్యాంటీన్ కొరకు నిర్వహిస్తున్న కూరగాయల సాగును, పోలీస్ శాఖకు హీరో మోటార్ కార్పొరేషన్ అందించిన ద్విచక్ర వాహనాలను ఐజి పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్పీ వై.రవి శంకర్‌రెడ్డి, అదనపు ఎస్పీ జి.బిందుమాధవ్, ఆర్‌ఐ రామచంద్రరాజు, డీఎస్పీలు, సిఐలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, ఉద్యోగావకాశాల కోసం యువకులు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నారని తెలుగు దేశం పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ నాయకులు కోడెల శివరాం విమర్శించారు. సత్తెనపల్లి దీపాలదిన్నెపాలెంలో టిడిపి ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కోడెల శివరాం మాట్లాడుతూ నవ్యాంధ్ర ప్రదేశ్ తొలి శాసన సభాపతి కోడెల శివప్రసాద రావు నియోజకవర్గాన్ని చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా అభివద్ధి చేశారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తోందని విమర్శించారు. పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-కారెంపూడి

ప్రతి నెలా 1వ తేదీ జీతాలు చెల్లించాలని, పది నెలలుగా పేరుకుపోయిన పిఎఫ్ బకాయిలు చెల్లించాలని ఎపిటిఎఫ్ కారంపూడి శాఖ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. 17 డిమాండ్లతో కూడిన సమస్యలను పరిష్కరించాలని మండలంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన నిర్వ హించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మండల శాఖ బాధ్యులు మాట్లాడుతూ 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలని, 11వ వేతన సవరణలోని అసంగతాలను సరిచేయాలని డిమాండ్ చేశారు. 3,4,5 తరగతుల విలీన ప్రక్రియను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు నాయక్,కె.ఆదినారాయణ, బి.మాన్ సింగ్ నాయక్,జి. భాష్కరరావు,బి.బాబు నాయక్ పాల్గొన్నారు.

1600 ఏళ్ల నాటి పురాతన శిల్పం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి: దుగ్గిరాల మండలంలో పెదకొండూరులో గత కృష్ణా పుష్కరాలలో లభ్యమైన పురాతన అర్ధనారీశ్వర శిల్పం 1600 ఏళ్ల నాటిదని గ్రామంలో పురావస్తు శాఖ పరిశోధకులు ఈమని శివనాగిరెడ్డి వివరించారు. ఈ శిల్పం ఉనికిని గురించి ప్రముఖ శాసన పరిశోధకులు, పి.వీ.పరబ్రహ్మశాస్త్రి ఇచ్చిన సమాచారం మేరకు, అరుదైన ఈ శిల్పాన్ని ఆయన పరిశీలించి, ఆసక్తికరమైన చారిత్రక విషయాలను వెల్లడించారు. క్రీ.శ.4వ శతాబ్దిలో గుంటూరు జిల్లా చేజర్ల, కం తేరుల నుంచి, ఈ ప్రాంతాన్ని పాలించిన ఆనందగోత్రినులనే రాజులు, పెదకొండూరులో ఆనందేశ్వరాలయాన్ని నిర్మించి, పల్నాటి సున్నపురాతి శివలింగంపై అర్ధనారీశ్వర శిల్పాన్ని చెక్కించి ప్రతిష్ఠించారని, అర్ధనారీశ్వర శిల్పమున్న ఈ శివలింగం దేశంలోనే మొట్టమొదటిదనీ ఆయన తెలిపారు. ఆలయ ప్రాంగణంలో క్రీ.శ.12వ శతాబ్ది నాటి బ్రహ్మ, సరస్వతి, మహిషమర్ధిని, సూర్య విగ్రహాలు, క్రీ.శ.1170, క్రీ.శ.1173, క్రీ.శ.1317 సంవత్సరాల నాటి శాసనాలను పీఠాలపై నిలబెట్టి వాటి చారిత్రక ప్రాశస్త్యాన్ని తెలియజేప్పే నామ ఫలకాన్ని ఏర్పాటు చేయాలని, పెదకొండూరు గ్రామ ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-మాచర్ల

ప్రభుత్వ విప్, ఎం.ఎల్.ఎ పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, అభిమానులు, బంధుమిత్రుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిపారు. పార్టీ కార్యాలయంతో పాటు ఇతర ప్రాం తాలలో భారీ కేక్‌లను ప్రభుత్వ విప్, ఎం.ఎల్.ఎ పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డిచే కట్ చేయించి అభినందనలు తెలిపారు. మున్సిపల్, ఎం.పి.డి.ఓ కార్యాలయాలతో పాటు పలు చోట్ల ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలలో ప్రభుత్వ విప్, ఎం.ఎల్.ఎ పిన్నెల్లి రామ క్రిష్ణారెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన జరుగుతుందన్నారు. పేద ప్రజలకు ఇంత పెద్ద మొత్తంలో సంక్షేమ కార్యక్రమాలు గతంలో ఎప్పుడు జరగలేదన్నారు. చంద్రబాబు, అతని మీడియా పరి పాలనపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని వాపో యారు. ప్రజలు వారి వలలో పడకూడదన్నారు. వైసిపి కార్యకర్తలు, అభిమానులు ప్రభుత్వం అందజేస్తున్న సం క్షేమ, అభివృద్ధి గురించి తెలియజేశారు. ప్రభుత్వం నుండి వచ్చే సహాయ, సహకారాల గురించి వాలంటీర్లు, గృహ సారధులు ప్రజలకు తెలియజేయాలన్నారు. కూడళ్ళలో, వీధులలో అభిమానులు ఫ్లెక్సిలు ఏర్పాటు చేశారు. పలు చోట్ల అభిమాన సంఘాల ఆధ్వర్యంలో పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. అనేక ప్రాంతాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలు దేవాలయాలలో పిన్నెలి పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర యువజన సంఘ ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, నాయకులు శ్రీనివాసశర్మ, తురకా కిషోర్, బూడిద శ్రీనివాసరావు, కుర్రి సాయిమార్కోండారెడ్డి, రామిశెట్టి వెంకటేశ్వర్లు, మాచర్ల చినఏసోబు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గిరిజనుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. వైసిపి గిరిజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ ఆధ్వర్యంలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 284 వ జయంతి వేడుకలు బుదవారం ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ సేవాలాల్ బంజారా జాతి ప్రజల శ్రేయస్సుకై స్వశక్తితో జీవించే మార్గాన్ని చూపి తండా ప్రజల్లో ఉన్న మూఢ నమ్మకాలను, సాంఘిక దురాచారాలను పారద్రోలి అని కొనియాడారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ లాంటి మహనీయులను స్మరించుకుంటూ జాతి ప్రజలు ఉన్నతమైన ఆలోచనలతో ఉన్నత స్థితికి చేరాలని ఆకాంక్షించారు. బంజారాల సాంప్రదాయ తలపాగాను ధరించి నంగారాను మోగించి, సేవాలాల్ మహారాజ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం భోగ్ భండారో కార్యక్రమాన్ని నిర్వహించి బంజారా మహిళలు సాంప్రదాయ దుస్తులతో నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బత్తుల దేవానంద్, సోషల్ వెల్ఫేర్ బోర్డ్ డైరెక్టర్ గనిక ఝాన్సి , వైసిపి గిరిజన విభాగం నగర ప్రధాన కార్యదర్శి దనావత్ వెంకటేశ్వర్లు నాయక్, గిరిజన నాయకులు రమావత్ భీక్కు నాయక్, రమావత్ అంజి నాయక్ రూప్లానాయక్ పాల్గొన్నారు. **యడ్లపాడు:** శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి మండలంలోని బోయపాలెం లోని సుగాలి(ఎస్టీ) కాలనీలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎపి గిరిజన సంఘాల ఐక్యవేదిక మండల అధ్యక్షులు వి. శ్రీనివాస్ నాయక్ తదిరులు పాల్గొన్నారు.**నరసరావుపేట:**

ప్రజా శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాలు ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలన సాగించాలని టిడిపి ఎస్టి నాయకులు సూచించారు. స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో బుధవారం సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. **బెల్లంకొండ :** మండలంలోని న్యూ చిట్యాల (మాచయపాలెం ఆర్ అండ్ ఆర్ సెంటర్)లో పల్నాడు జిల్లా లంబాడి ఐక్య వేదిక ఇంచార్జి భూక్యా రామాంజనేయులు నాయక్ నాయక్ ఆధ్వర్యంలో దండి మెరా మాయాడి చెట్టు దగ్గర సేవాలాల్ జయంతి నిర్వహించారు.

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డొక్కామాణిక్యవరప్రసాద్

కందిపప్పు టెండర్లలో అవినీతిపై కేంద్ర మంత్రికి ఫిర్యాదు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని నేషనల్ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (నాఫెడ్) టెండర్ల ద్వారా రాష్ట్రానికి సరఫరా చేసే కంది పప్పులో రూ.700 కోట్లు అవినీతి జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వినుకొండకు చెందిన వ్యాపారులు కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ టెండర్లలో ప్రతిసారి గుజరాత్ రాష్ట్రానికి చెందిన మిలాప్ ట్రేడర్స్, విశాఖపట్నం కు చెందిన కేంద్రీయ బండారు, విజయవాడకు, వినుకొండ కు చెందిన ఇద్దరు డాల్మిల్ యజ మానులకు అనుమతి ఇచ్చారు. రాష్ట్రంలోనే కందుల సరఫరాకు కేంద్ర బిందువు అయిన వినుకొండలో డాల్ మిల్లర్స్ వ్యాపారులు కొందరు సిండికేట్ అయి, నాఫెడ్ వారితో కుమ్మక్కై, వారిష్టానుసారంగా కందిపప్పు సరఫరా చేస్తుంటారని ఆరోపించారు. ఆఫ్రికా నుంచి కేవలం కేజీ రూ.57 కు కొనుగోలు చేసి ఆ పప్పుకు పాలిష్ పట్టి ప్రభుత్వం ఇచ్చిన కిలో ప్యాకేజీ బ్యాగుల్లో వాటిని నింపి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. గుజరాత్‌కు చెందిన మిలాప్ అనే వ్యాపారి, ఎపికి చెందినవారు కాదని, ఇక్కడ సొంత మిల్లు కూడా లేదని, విశాఖపట్టణానికి చెందిన కేంద్రీయ బండార్ యజమాని మస్తాన్‌రావుకు సొంత ఇల్లు కూడా లేదని, ఇటువంటి వ్యక్తులకు వందల కోట్ల రూపాయల టెండర్లు ఇవ్వడం వెనుక పెద్ద కందిపప్పు మాఫియా ఉందని ఆరోపించారు. నకిలీ పత్రాలతో ఆస్తుల వివరాలతో వందల కోట్ల రూపాయల టెండర్లను సొంతం చేసుకున్నారని, అవినీతికి పాల్పడ్డ వారిపై సమగ్ర విచారణ జరపాలని,కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రికి వివరించినట్లు తెలిపారు.

టిడిపి నుంచి ఇద్దరు సస్పెన్షన్

ప్రజాశక్తి-పెదకూరపాడు:

టిడిపి నుంచి ఇద్దరిని సస్పెండ్ చేసినట్లు పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు జీవి ఆంజనేయులు తెలిపినట్లు మండల అధ్యక్షులు రమేష్ తెలిపారు. ఆ ఇద్దరు పెదకూరపాడు మండలంలోని పరస గ్రామానికి చెందిన అధికార ప్రతినిధి నూతలపాటి వెంకట శివరావు, హుస్సేన్ నగరం గ్రామానికి చెందిన కార్యదర్శి ఆరుమాళ్ళ సుజాత ఉన్నట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ నియమావళికి వ్యతిరేకంగా పనిచేసినట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

నాగేశ్వరరావును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ

కళాకారుడు నాగేశ్వరరావుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలి

శకపురుషుని శతజయంతి పేరిట మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారథ్యంలో స్థానిక బోస్-రోడ్డులోని పెమ్మసాని థియేటర్‌లో ఏడాది పాటు నిర్వహిస్తున్న ఉత్సవాల్లో బుధవారం ఎన్టీఆర్ నటించిన ఇంటికి దీపం ఇల్లాలే చిత్రాన్ని ప్రదర్శించారు. అలాగే కళాకారుల సత్కారాల్లో భాగంగా పట్టణానికి చెందిన ప్రముఖ సాంఘిక నాటక కళాకారుడు పొదిలి నాగేశ్వరరావును థియేటర్ కమిటి సత్కరించింది. కార్యక్రమంలో చల్లగాలి శ్రీనివాసరావు, పాశం గోవింద, పుట్టి అరవింద్‌బాబు, కాకుళపు మురళీకృష్ణ, నరేష్, అయినాల మల్లేశ్వరరావు, ఈ. శ్రీనివాసరావు, ఎస్.సాంబ వరావు, డి.భవాని, ఎస్.సాంబశివరావు పాల్గొన్నారు.

గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

బీసీ జనబేరి గోడపత్రికలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి

బీసీ హక్కుల సాధన కోసం ఈ నెల 22వ తేదీన నియోజకవర్గ బీసీ సేన ఆధ్వర్యంలో జరిగే బీసీ జనభేరి సదస్సు గోడ పత్రికలను బుధవారం బీసీ సేన నాయకులు ఆవిష్కరించారు. బుధవారం స్థానిక బీసీ సేన కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీసీ సేన జిల్లా అధ్యక్షుడు గోలి నాగకుమార్ మాట్లాడుతూ బీసీల హక్కుల సాధన కోసం 22న జరిగే బీసీ జనభేరి సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా బీసీ సేన జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షులు శొంఠి నాగరాజు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సేన రాష్ట్ర నాయకులు పి. రంగనాథ్, ఎం. ఆంజనేయులు, కె.కిషోర్, బీసీ సేన నియోజకవర్గ, పట్టణ అధ్యక్షులు సాదు వేణుగోపాల్, కె. వెంకట కోటేశ్వరరావు, నాయకులు ఎన్ దుర్గా మహేష్, కె.శ్రీను, టి.వేణు, జి.వెంకయ్య పాల్గొన్నారు

శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్న మద్దాలి శేషాచలం

క్లాత్ పెయింటింగ్ శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-తెనాలి

పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బోస్‌రోడ్డులోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో మహిళలకు, బాలికలకు క్లాత్ పెయింటింగ్ శిక్షణా తరగతులను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిదిగా పాల్గొన్న ఆర్యవైశ్య సంఘాల కో-ఆర్డినేటర్ మద్దాలి శేషాచలం తరగతులను ప్రారంభించారు. అర్యవైశ్య సంఘం అధ్యక్షులు భాస్కరుని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శేషాచలం మాట్లాడుతూ మహిళల స్వయం ఉపాదికి ఉపకరించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ శిక్షణ ఎంతో ప్రయోజనకరమైందని, ఆర్యవైశ్య మహిళలకు కూరపాటి శ్రీలక్ష్మి శిక్షణనిస్తారని తెలిపారు. కార్యక్రమంలో గొడవర్తి సాయిహరేరామ్, కొల్లాగుర్నాద గుప్తా, కె.లక్ష్మీపద్మావతి, ఆలమూరి పూజ, ఆకి గోవర్ధన లక్ష్మి పాల్గొన్నారు.

రవాణా రంగంపై మోయలేని భారాలు

ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య

సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మయ్య

ప్రజాశక్తి-గుంటూరు: మోటారు వాటర్ వాహనాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భారీ మొత్తంలో ఇన్సూరెన్స్ ప్రీమియంను, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగించాలని, 15 ఏళ్ల దాటిన వాహనాలు తీసివేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరిం చుకోవాలని తదితర డిమాండ్లతో ఏప్రిల్ 5న జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో చలో ఢిల్లీ జయప్రదం కోరుతూ ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ అధ్యక్షతన జిల్లా సదస్సు జరిగింది. సదస్సులో లక్ష్మయ్య మాట్లాడుతూ మోటార్ వెహికల్ సవరణ చట్టం 2019ని కేంద్రం ఆమోదించాక, రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 21 ద్వారా అన్ని రకాల చలానాలు జరిమానాలు పెంచి రవాణా రంగంపై భారాలు మోపిందన్నారు. రవాణా రంగాన్ని ప్రభుత్వం ఆదాయంగా భావించి సంక్షోభంలోకి నెట్టాయని విమర్శించారు. గ్రీన్ ట్యాక్స్ విపరీతంగా పెంచడం, ఇన్సూరెన్స్ రోడ్ టాక్స్ టోల్‌గేట్ 15శాతం పెంచడం వంటి చర్యలు గుదిబండగా మారాయన్నారు. రాష్ట్రంలో రవాణా రంగంపై నూతనంగా 30 శాతం రోడ్ టాక్స్ పెంచడం మరింత దెబ్బతీయటమేనని అన్నారు. ట్యాక్సులు, పెనాల్టీలతో, బాడుగలు లేక ఇబ్బంది పడుతున్న వాహనదారులు 15 ఏళ్ళ దాటిన వాహనాలు తీసివేయాలనే నిర్నయం వల్ల దేశంలో రెండు కోట్లకుపైగా కార్మికులు ఉపాది కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్‌లను జిఎస్టి పరిధిలోకి తీసుకొొచ్చి ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికులతో పాటు ఇతర అన్ని రంగాల కార్మికుల సమస్యలపై ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమంలో రవాణా రంగ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌కె.మస్తాన్‌వలి, ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి యం.హరిపో తురాజు, గుంటూరు జిల్లా ఆటో డ్రైవర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, ట్రాన్స్‌పోర్ట్ నాయకులు కె.శ్రీనివాసరావు, గుంటూరు నగర ఆటో డ్రైవర్ యూనియన్ నగర కార్యదర్శి జి.శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టర్కీ-సిరియా భూకంప బాధితులకు సహాయార్థం రూ.7665 లక్ష్మయ్యకు సదస్సు ప్రతినిధులు అందచేశారు.

సైకిల్ వ్యాయామంతో కేన్సర్ తగ్గుదల

గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ప్రజాశక్తి - కొల్లిపర

సైకిల్ వ్యాయామం ద్వారా ఆరోగ్యకరమైన జీవనాన్ని పొందవచ్చునని మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కొత్తపల్లి బాబురావు అన్నారు. బుధవారం మండలంలోని మున్నంగి గ్రామం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో " సైకిల్ వ్యాయామం క్యాన్సర్ తగ్గుదల " అనే అంశంపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులపై గత 8 ఏళ్లుగా అధ్యయనం చేయగా 46% నుండి50% వరకు తగ్గుదల కనిపించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం మన తినే ఆహారం అనేక రకాల రసాయనాలు కలిగి ఉండటం వల్ల అవి విషతుల్యంగా మారి కెన్సర్‌కు దారితీస్తుందని అన్నారు. అందువలన ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలన్నారు. అనంతరం మున్నంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే గ్రామంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి అందే బాలచంద్రమౌళి, వంగర బుచ్చిబాబు, డి.స్వరూప రాణి, పాఠశాల ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న కాటూరి రాము

శ్రీశైలం దేవస్థానానికి 2.50 టన్నుల పచ్చళ్లు వితరణ

ప్రజాశక్తి -మంగళగిరి: మహాశివరాత్రి పర్వ దినోత్సవానికి శ్రీశైలంలో జరిగే అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమానికి అవసరమయ్యే సుమారు రూ.7 లక్షల రూపాయల విలువ కలిగిన మొత్తం 9 రకాలను పచ్చళ్లను బుధవారం విజయ పికిల్స్ సంస్థ నిర్వాహకులు కాటూరి రాము వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఏడాది తిరుపతిలో జరిగే బ్రహ్మోత్సవాలు, విజయవాడలో జరిగే అమ్మవారు ఉత్సవాలతోపాటు దైవ కార్యక్రమాలకు మా సంస్థ నుండి వివిధ రకాల పచ్చళ్ళను పంపిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 18వ తేదీన శ్రీశైలంలో జరిగే మహాశివరాత్రికి ఉత్సవాలకు భక్తుల ఏర్పాటు చేసే అన్నదాన కార్యక్రమంలో మా వంతుగా టమోటా, మామిడికాయ, నిమ్మకాయ గోంగూర, కాలీఫ్లవర్, కట్ మ్యాంగో , ఎర్రమిరపకాయ పచ్చడి , అల్లం పచ్చళ్ళు పచ్చళ్లను అందజేస్తున్నామని రాము వెల్లడించారు.

బాలికలు, మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి

ముఖ్య అతిథి ఉషారాణిని సత్కరిస్తున్న కెఎల్‌యు అధ్యాపబృందం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

బాలికలు, మహిళలు అన్ని రంగాలలో ఎదగాలని విశ్రాంత ఇండియన్ బ్యాంకు మేనేజర్ కె.ఉషారాణి అన్నారు. బుదవారం కెఎల్ విశ్వవిద్యాలయంలో విజ్ఞానశాస్త్రంలో మహిళలు, బాలికల ప్రమేయం పై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. జాతీయ సదస్సుకు విద్యార్థి వ్యవహారల అసోసియుట్ డీన్ డాక్టర్ కె.రూతురమ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ఉషారాణి మాట్లాడుతూ బాలికలు, మహిళలు విజ్ఞాన శాస్త్రంలో ముందుకు దూసుకుపోవాలన్నారు. పలు రకాల పరిశోధనల చేయడంలో బాలికలే ముందంజలో ఉన్నారని తెలిపారు. మహిళా అబివృద్ధి సెల్ సభ్యులు, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతురమ్య మాట్లాడుతూ కెఎల్ విశ్వవిద్యాలయం ద్వారా బాలికలు విద్యలో అంచెలంచెలుగా ఎదుగుతున్నారని అన్నారు. గూగుల్‌లో రూ.60 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం సాదించిన రావూరి పూజిత అందుకు ఉదాహరణ అన్నారు. టీవల భౌతిక శాస్త్రంలో పరిశోధనలు చేసి సోలార్ విద్యుత్ ద్వారా నీటిని శుద్ధి చేసే యంత్రాన్ని కనిపెట్టిన సంగీతకు జాతీయ స్థాయిలో అవార్డు రావడం బాలికలందరకీ స్ఫూర్తి దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ, ప్రో విసి డాక్టర్ ఎన్.వెంటకరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు, సాక్ డైరెక్టర్ సాయి విజయ్, మహిళా ఫోరం సభ్యురాలు సత్య, సేఫ్ టీం కార్యదర్శి వాణి, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా ఏపి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి : రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధి దేశంలోనే అగ్రగామిగా ఉందని రాజ్యసభ ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి అన్నారు. గుంటూరు వైసిపి ప్రాంతీయ సమన్వయకర్త కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అయోధ్య రామిరెడ్డి మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ హయాంలో కేవలం మూడేళ్లలోనే ఎంఎస్ఎంఈ యూనిట్ల సంఖ్య 60 శాతం పెరగడంతోపాటు, ఉద్యోగాల కల్పనలో 38 శాతం పెరుగుదల నమోదు చేసిందన్నారు. 'ఎంఎస్ఎంఇ రీస్టార్ట్', 'వైయస్సార్ జగనన్న బడుగు వికాసం', 'డా. వైయస్సార్ నవోదయం' తదితర పథకాల ద్వారా ఎంఎస్ఎంఈలకు ప్రభుత్వం పలు రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తోందని వివరించారు."రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధిని పెంచడం కోసం, సీఎం జగన్ అధ్యక్షతన 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక బోర్డు(ఎస్ఐపిబి) 2022 జూలైలో రూ. 1.26 లక్షల కోట్లు, 2022 డిసెంబర్ లో రూ. 23,985 కోట్లు, 2023లో రూ. 1.44 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపిందని గుర్తు చేశారు. మొత్తంగా రూ. 2.93 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను ఏపీకి తెచ్చినట్లు వివరించారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లి ఎన్‌టిఆర్ కట్టపై రెండు రోజుల క్రితం జరిగిన అంధ బాలిక హత్య కేసులో నిందితుడిని కఠినంగా శిక్షించాలని గుడ్‌షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ పోలీస్ అధికారులను కోరారు. ఈ ఘటన తమను ఎంతో కలచివేసిందని చెప్పారు. పోలీస్ అధికారులు, న్యాయస్థానం ఇటువంటి దుండగులకు కఠిన శిక్ష పడే విధంగా చూడాలని కోరారు. ప్రజలు, ప్రభుత్వం ఆ కుటుంబానికి అండగా నిలవాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-మంగళగిరి: మంగళగిరి పట్టణంలో గల హిరా ఇస్లామిక్ స్కూల్లో బుధవారం హీరా చారిటబుల్ ట్రస్ట్, మై మదర్స్ క్లినిక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు, ఆ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచితంగా పరీక్షలు నిర్వహించి, రక్త పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఖాన్, ఎన్ ప్రవీణ్, అంజుమన్ సంస్థ అధ్యక్షులు అష్రఫ్ ఖాన్, ట్రస్ట్ సభ్యులు ఆలీ భాష ఖాన్, పాఠశాల ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

వాటర్‌పైప్ లైన్ల పరిశీలన

ప్రజాశక్తి - తాడేపల్లి: ఎంటిఎంసి పరిధిలోని తాడేపల్లి సలాం సెంటర్‌లో వాటర్ పైప్‌లైన్లను ఏఈ ప్రవీణ్ పరిశీలించారు. వైసిపి తాడేపల్లి పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి తాగునీరు సరిగా రావడం లేదని అర్జీ పెట్టగా బుధవారం సలాం సెంటర్ 6 వార్డు ఏరియాలో ఆయన పర్యటిస్తూ స్థానిక ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగు నీరు సరిగా రావడం లేదని తెలిపారు. ఒక వారం రోజులో పైప్ లైన్లను ఏర్పాటు చేసి తాగు నీరు సక్రమంగా అందే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు.అలాగే డ్రైన్ సమస్యను కూడా పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, గుంటూరు జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు మేకా వెంకట్రామిరెడ్డి, స్థానిక నాయకులు వేముల కోటేశ్వరావు, సిపిఐ తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, సానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ ప్రసాద్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధర్మ భిక్షం 101వ జయంతి వేడుకలు

ప్రజాశక్తి- మంగళగిరి: స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట వీరుడు అఖిలభారత గీత పరివార్ల సంఘం మాజీ అధ్యక్షులు ధర్మభిక్షం 101వ జయంతి సభ బుధవారం మంగళగిరి కల్లు గీత సొసైటీ ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమానికి కంచర్ల కాసియా అధ్యక్షత వహించారు. పలువుర నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులు ధర్మ బిక్షం గ్రామీణ పేదలు హక్కుల కోసం గీత, యువత, విద్యార్థులు అసంఘటిత కార్మికుల పేదలకోసం పోరాడారు అని కొనియాడారు.

రిజర్వాయర్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న మేయర్ శివనాగ మనోహర్ నాయుడు

వేసవిలో తాగునీటి సమస్యలు రానివ్వొద్దు

నెహ్రూ నగర్‌లో రిజర్వాయర్‌ను పరిశీలించిన మేయర్

ప్రజాశక్తి - గుంటూరు

రానున్న వేసవిలో నగర ప్రజలకు తాగు నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని గుంటూరు నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులను మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు ఆదేశించారు. నెహ్రూ నగర్ రిజర్వాయర్‌ను మేయర్ బుధవారం పరిశీలించారు. పలు ప్రాంతాల్లో పైప్ లైన్లకు లీకులు ఏర్పడి నీరు వృథా అవుతున్నట్లు ఫిర్యాదు వస్తున్నాయని, వాటిని గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అనంతరం 56వ డివిజన్‌లో అభివృద్ధి పనులపైన మాట్లాడారు. పనుల టెండర్ తగ్గించుకున్న కాంట్రాక్టర్లు తక్షణమే పనులను ప్రారంభించాలన్నారు. కొందరు కాంట్రాక్టర్లు పనులు చేయటలేదని, అటువంటి సంస్థలను బ్లాక్‌లిస్టులో పెట్టాలని ఆదేశించారు. జరుగుతున్న పనుల నాణ్యతను నిత్యం పరిశీలించాలని, రాజీ పడొద్దని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఐ.కనకదుర్గ శ్రీనివాస్, పి.అంబేద్కర్, డి.వంశీబాబు, ఇఇ శాంతిరాజు, డిఇఇ శ్రీనివాసరెడ్డి, వైసిపి నాయకులు గులాం రసూల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్ల భర్తీకి ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - గుంటూరు

నగరపాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయాల్లో వాలంటీర్ పోస్టుల భర్తీకి డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా 381 మంది దరఖాస్తు చేసుకోగా కొందరికి సరైన ధ్రువ పత్రాలు లేకపోవడంతో తిరస్కరించినట్లు చెప్పారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం 298 మందిని అర్హులుగా ప్రకటించామని, వీరిలో 170 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారని తెలిపారు. ఎంపికైన వారిని ఫోన్ ద్వారా సమాచారం పంపుతామని, శుక్రవారం నుండి విధుల్లో చేరాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

19న ఎస్ఐ పోస్టులకు రాత పరీక్ష

గుంటూరు జిల్లాలో 23 కేంద్రాల్లో పరీక్షలు - ఏర్పాట్లపై ఐజి సమీక్ష

సమీక్షలో మాట్లాడుతున్న గుంటూరు రేంజ్ ఐజి త్రివిక్రమ వర్మ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పోలీస్ శాఖలో ఎస్ఐ పోస్టుల భర్తీలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఈనెల 19న నిర్వహించే ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాట్లు చేస్తున్నామని గుంటూరు రేంజ్ ఐజి. త్రివిక్రమ్ వర్మ తెలిపారు. పరీక్షలకు చీఫ్ కో-ఆర్డినేటర్‌గా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజ్ ప్రొఫెసర్ సిద్ధయ్య వ్యవహరిస్తారన్నారు. ఈ మేరకు ఇన్విజిలేటర్లు, సూపరింటెండెంట్లు, పోలీసు అధికారులతో ఐజి బుధవారం ఎస్పీ కార్యాలయంలో సమీక్షించారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు ఉంటాయని, జిల్లాలోని 23 పరీక్ష కేంద్రాల్లో వీటిని నిర్వహిస్తామని తెలిపారు. అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచి సెంటర్లలోనికి అనుమతిస్తారని, ఉదయం 10 గంటలకి ఒక్క నిమిషం దాటినా అనుమతించరని స్పష్టం చేశారు. మధ్యాహ్నం పరీక్షకు 1.30 గంటల నుండి పరీక్ష హాలులోకి అనుమతి ఉంటుందని, 2.30 గంటలు దాటిన తర్వాత అనుమతి ఉండదని తెలిపారు. పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయాలని, అవసరమైన సదుపాయాలు కల్పించాలని పోలీసు అధికారులకు చెప్పారు. పరీక్ష కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సిసి కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పోలీసు సిబ్బందితో పాటు అదనంగా రక్షక్ మొబైల్స్, బ్లూ కోల్ట్స్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. కేంద్రాల పరిధిలో జిరాక్స్ కేంద్రాలను మూసేయించాలన్నారు. పరీక్ష కేంద్రానికి వెళ్లే అభ్యర్థులకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులతో తగిన ఏర్పాట్లు చేశామన్నారు. అభ్యర్థులను ఏదైనా గుర్తింపు కార్డు ఉంటేనే కేంద్రంలోకి అనుమతిస్తారని, ఫోన్లు, ఇతర వస్తువులను అనుమతించరని తెలిపారు. సమీక్షలో ఎస్పీలు సుప్రజ శ్రీనివాసరావు, అనిల్ కుమార్, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మనుస్మృతి ప్రతులు దహనం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

భారత రాజ్యాంగాన్ని అవమానిస్తూ మనుస్మృతి గ్రంథాన్ని ఆవిష్కరించడం దారుణమని కెవిపిఎస్ నాయకులు విమర్శించారు. ఈ మేరకు స్థానిక ఎన్ఆర్‌టి సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన తెలిపి మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి ఎం.విల్సన్ మాట్లాడుతూ దేశాన్ని మధ్యయుగాల నాటికి తీసుకెళ్లడానికి బిజెపి, ఆర్ఎస్ఎస్ యత్నిస్తున్నాయని విమర్శించారు. మనుస్మృతిని ఇప్పటికే అంతర్లీనంగా అమలు చేస్తున్నారని, దళితులు, మైనార్టీ మతస్థులపై దాడులకు తెగబడుతున్నారని విమర్శించారు. ఇటువంటి హేయమైన కార్యక్రమాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబు, బి.శ్రీనునాయక్, రోశయ్య, శ్యామ్‌దాసు, కోటనాయక్ పాల్గొన్నారు.

మనుస్మృతి ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

ఎస్ఈ మురళీకృష్ణయాదవ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెయిడ్ హాలిడేస్ విడుదల చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్ పెయిడ్ హాలిడేస్, పదేళ్ల ఇంక్రిమెంట్లు అమలు చేయాలని కోరుతూ విద్యుత్ గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఇ ఆవుల మురళీకృష్ణ యాదవ్‌కు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్లకు పండగ సెలవుల్లో విధులు నిర్వహించినందుకు గాను ఇవ్వాల్సిన పెయిడ్ హాలిడేస్‌లను వెంటనే ఇవ్వాలని కోరారు. సిపిడిసిఎల్ పరిధిలో పదేళ్ల ఇంక్రిమెంట్ అమలు నిలిపివేత ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకొని కార్మికులకు న్యాయం చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, కోశాధికారి ఎం.బలరామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు బాషా పాల్గొన్నారు.

పాములు, అత్యాచారాల నుండి రక్షణ

పుస్తక మహోత్సవంలో ప్రత్యేక నమూనాలను ప్రదర్శించిన తాడేపల్లి జెడ్‌పి పాఠశాల విద్యార్థులు - పలువురి అభినందనలు

ప్రజాశక్తి-తాడేపల్లి

విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిసుఉన్న 33వ పుస్తక మహోత్సవంలో తాడేపల్లి జిల్లా పరిషత్ విద్యార్థులు బుధవారం ప్రత్యేక నమూనాలను ప్రదర్శించారు. పొలాల్లో రైతులను పాముల బారి నుండి కాపాడేందుకు వీలుగా 'సోలార్ స్నేక్‌గార్డ్' ప్రాజెక్టును ప్రదర్శించారు. పొలాల మీద వ్యవసాయం చేసే రైతులు పాము కాటుకు గురవకుండా ఇది రక్షణ కల్పిస్తుందని తెలిపి, అది పని చేసే విధానాన్ని వివరించారు. అత్యాచారాల నుండి బాలికలు తమను తాము కాపాడుకోవడానికి స్మార్ట్ స్కూల్ బ్యాగ్‌ను ప్రదర్శించారు. హైడ్రాలిక్ జెసిబి, డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టు, స్పీడ్ బ్రేకర్ ఆధారంగా విద్యుత్ ఉత్పత్తి, చూపు లేని వారు ఎక్కడికైనా ధైర్యంగా ప్రయాణించడానికి వీలుగా కళ్లద్దాలు, హోమ్ ఆటోమిషన్ ప్రాజెక్టు, ఒకేషనల్ స్టూడెంట్ పోర్టుపోలియోలు, వ్యర్థాలతో క్రాఫ్ట్ తయారీ తదితర ప్రాజెక్టులను ప్రదర్శించి అందర్నీ అబ్బుర పరిచారు. నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులను రిటైర్డ్ పాఠశాల విద్యా సంచాలకులు చినవీరభద్రుడు, అడిషనల్ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి, హెచ్ఎంలు రాయల సుబ్బారావు అభినందించారు. కార్యక్రమంలో వై.అపర్ణ, వంశీ, చిన్నరెడ్డి, భుజంగరావు, మనోహర్, మధు, కమలాకర్, ఒకేషనల్ ట్రైనర్ వి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల కోసం కేంద్ర మంత్రికి ఎంపి వినతి

గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయాలని కోరిన లావు శ్రీకృష్ణదేవరాయలు

ప్రజాశక్తి - నరసరావుపేట

మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపి శ్రీకృష్ణదేవరాయలు

గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లో జనాభా ప్రాతిపదికన మరికొన్ని అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ఈ మేరకు బుధవారం మంత్రిని ఢిల్లీలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం పల్నాడు జిల్లాలో 75 శాతం పైగా ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలకు చదువు, పోషకాహారాలను అందించే అంగన్వాడీ కేంద్రాలను కొత్తగా ఏర్పాటు చేయాలని కోరారు. గురజాల ప్రాజెక్టులోని దుర్గి, కారంపూడి మండలాల్లో లక్షకు పైగా జనాభా ఉంటే ప్రస్తుతం 95 అంగన్వాడీ కేంద్రాలే ఉన్నాయని, దుర్గికి 3, కారంపూడిలో 2 అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. మాచర్ల ప్రాజెక్టులోని మాచర్ల మున్సిపాలిటీ, మాచర్ల, రెంటచింతల, వెల్దుర్తి మండలాల్లో 2.10 లక్షలకుపైగా జనాభా ఉంటే ప్రస్తుతం 172 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని, మాచర్ల మున్సిపాలిటీకి మరో 39, రెంటచింతల మండలానికి 8 కేంద్రాలను ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.